

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 06-08-2025 | సంపుటి - 24 | సంచిక - 92 | రూ : 4 | పేజీలు: 8


## స్థానికత నిబంధనను..
# 2028 నుంచి అమలు చేయండి

- తెలంగాణకు సుప్రీంకోర్టు సూచన
- రాష్ట్ర ప్రభుత్వ పిటిషన్‌లో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు చేసిన ధర్మాసనం



దిల్లీ: ఎంబీబీఎస్‌లో స్థానిక కోటా కింద ప్రవేశాలు పొందాలనుకున్న విద్యార్థులు నీట్ రాయడానికి ముందు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదివి ఉండాలని జారీ చేసిన నిబంధనలను తప్పుబడుతూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌లో జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ విక్రమ్‌చంద్రన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు రిజర్వు చేసింది. మంగళవారం

తరువాయి 2లో




## బిఆర్ఎస్ అవినీతికి..
## కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

- అన్ని విషయాలు అసెంబ్లీలో పెట్టి చర్చిస్తాం
- బుకాయింపు రాజకీయాలు చేస్తే ప్రజలు ఊరుకోరు
- మంత్రి పొంగులేటి ఘాటు హెచ్చరిక

ఖమ్మం, ఆగస్టు 5 : కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అవినీతికి ఈ ప్రాజెక్ట్ పెద్ద ఉదాహరణ అని అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ

తరువాయి 2లో



2లో

### జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్
## సత్యపాల్ మాలిక్ కన్నుమూత

- ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా బాధ్యతలు
- బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా సేవలు
- సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎమ్మెల్యే, ఎంపీ, కేంద్ర మంత్రిగా పదవులు
- రైతు సమస్యలపై ప్రభుత్వ విధానాలను తరచూ విమర్శించిన నేత
- కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం

## చిన్న సాయమైనా సరే..
# కష్టాల్లో ఉన్న కుటుంబానికి కొండంత అండ



- పీ4 కార్యక్రమంపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష
- ఆగస్టు 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'పీ4' కార్యక్రమం అమలు
- 2029 నాటికి జీరో పావర్టీ సాధించడమే ప్రధాన లక్ష్యం
- 'మార్గదర్శులు' స్వచ్ఛందంగా 'బంగారు కుటుంబాలకు' సాయం
- పేద వృద్ధురాలికి అండగా నిలిచిన పారిశుద్ధ్య కార్మికురాలికి సీఎం ప్రశంస

2లో



2

## మణిపూర్‌లో
## రాష్ట్రపతి పాలన పొడిగింపు

- తీర్మానాన్ని ఆమోదించిన రాజ్యసభ

న్యూఢిల్లీ, ఆగస్టు 5: ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరు నెలలు పొడిగించేందుకు మార్గం సుగమం అయింది. మంగళవారం రాజ్యసభ ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఉదయం, ప్రతిపక్షాల తీవ్ర నినాదాల

తరువాయి 2లో



2లో

## నేడే కాంగ్రెస్..
# మహాధర్నా

- రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీలో సీఎం, పీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం
- హాజరుకానున్న రాహుల్‌గాంధీ, ఇండియా కూటమి పార్టీల ఎంపీలు
- ఢిల్లీకి చేరుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీసంఘాల ప్రతినిధులు

## ప్రాణభయంతో మసూద్ అజహర్..
## రహస్య స్థావరాలకు తరలిస్తున్న పాక్ ఐఎస్ఐ!

### భారత దాడుల తర్వాత ప్రాణభయంతో అజ్ఞాతంలోకి జైషే మహ్మద్ చీఫ్

- అతడిని కాపాడేందుకు ఊరూరా తిప్పుతున్న పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ
- ఆపరేషన్ సిందూర్‌లో కుటుంబ సభ్యులను కోల్పోయిన అజార్
- తీవ్రంగా దెబ్బతిన్న జైషే క్యాడర్ నైతిక స్థైర్యం
- కార్యకర్తల్లో ధైర్యం నింపేందుకు పాత ఆడియో క్లిప్‌లతో ప్రచారం
- హాఫీజ్ సయీద్, సయ్యద్ సలాహుద్దీన్‌లకు కూడా ఇస్లామాబాద్‌లో కట్టుదిట్టమైన భద్రత



2లో



## కాటన్ మాదిరి కేసీఆర్
## చరిత్రలో నిలిచిపోతారు

- సర్ ఆర్థర్ కాటన్ తో కేసీఆర్ ను పోల్చిన హరీశ్ రావు
- తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని వ్యాఖ్య
- రాష్ట్ర భవిష్యత్తు కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ వంటి ప్రాజెక్టులను కేసీఆర్ నిర్మించారని కితాబు

బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు రాజమండ్రి వద్ద గోదావరి నదిపై ధవళేశ్వరం బ్యారేజీని కట్టి ఉభయ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో నిలిచిపోయిన సర్ ఆర్థర్ కాటన్ తో బీఆర్ఎస్ అధినేత

తరువాయి 2లో

# స్థానికత నిబంధనను 2028 నుంచి అమలు చేయండి

(మొదటిపేజీ తరువాయి)

వాదనలను విన్న అనంతరం విచారణను ముగిస్తున్నట్లు ప్రకటించింది. ఇంకేమైనా వాదనలుంటే శుక్రవారంలోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని ఆదేశించింది. స్థానికత సమస్యకు ప్రభుత్వమే పరిష్కార మార్గాలను చూపాలని, లేదంటే పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ గవాయ్ గత నెల 23న విచారణ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం జరిగిన విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ పరిష్కార మార్గాలు చెప్పకుండా తాము వాదనలు వినిపించాలనుకుంటున్నట్లు ధర్మాసనానికి చెప్పారు. దాంతో విచారణ ముగించి... ''తెలంగాణ శాశ్వత నివాసులైన విద్యార్థులు ఇంటర్ పరీక్షలను తెలంగాణలో రాయకపోయినా ఎంబీబీఎస్ ప్రవేశాలకు అనుమతివ్వాలి'' అని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేయడానికి సీజేఐ సిద్ధమయ్యారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ... ధర్మాసనం అలాంటి ఉత్తర్వులు జారీ చేయడానికి ముందు తమ వాదనలు వినాలని అభ్యర్థించారు. అందుకు సీజేఐ అంగీకరించారు. దీంతో సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ''ఒక్కో ఎంబీబీఎస్ సీటు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోటి ఖర్చుపెడుతోంది. ఆ ప్రయోజనాలను స్థానికంగా చదివిన పేద, మధ్యతరగతి విద్యార్థులకు కల్పించాలన్న ఉద్దేశంతోనే వరుసగా నాలుగేళ్లు రాష్ట్రంలో చదివి ఉండాలన్న నిబంధన తీసుకొచ్చింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డీని అనుసరించే ఈ నిబంధన తీసుకొచ్చాం. కర్ణాటక, అస్సాం, హరియాణాల్లోనూ ఇలాంటి నిబంధనలు ఉన్నాయి'' అని అభిషేక్ సింఘ్వీ వివరించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి హాజరై అంతర్రాష్ట్ర బదిలీలకు అవకాశం ఉండే అఖిల భారత సర్వీసు ఉద్యోగులు, న్యాయమూర్తులు, ప్రభుత్వరంగ సంస్థల ఉద్యోగులు, సైనిక దళాలు, పారామిలిటరీ దళాల్లో పనిచేసేవారి పిల్లలకు ఈ నిబంధన నుంచి వెసులుబాటు కల్పిస్తామని హామీ పత్రాన్ని ధర్మాసనానికి సమర్పించారు.

**విద్యార్థులను ముందే హెచ్చరించాలి: సీజేఐ**

రాష్ట్ర ప్రభుత్వ వాదనలపై జస్టిస్ గవాయ్ పలు ప్రశ్నలు సంధించారు. ''రాష్ట్రంలో పుట్టిన/పదో తరగతి వరకు చదివిన/తల్లిదండ్రులు ఇక్కడే శాశ్వత నివాసం ఉన్న విద్యార్థి వేరే రాష్ట్రాల్లో ఇంటర్ చదివారన్న కారణంతో ప్రవేశాలను నిరాకరించవచ్చా? జేఈఈ, నీట్ శిక్షణ నిమిత్తం రాజస్థాన్‌లోని కోటాకు దేశం నలుమూలల నుంచీ విద్యార్థులు వెళ్తుంటారు. అలా వెళ్లినవారి పరిస్థితి ఏంటి? ఉదాహరణకు తెలంగాణకు ఐఏఎస్ అధికారి డిప్యుటేషన్‌పై దిల్లీకొచ్చినప్పుడు ఆయన కుమారుడు దిల్లీలో ఇంటర్ చదివాడని పక్కన పెట్టేస్తారా? అకస్మాత్తుగా తెచ్చిన నిబంధన గురించి తెలియని విద్యార్థులు వేరే రాష్ట్రంలో చదువుకోవడానికి వెళితే అక్కడా, ఇక్కడా స్థానికులు కాకుండా పోయే ప్రమాదముంది. ఇలాంటి నిబంధనతెలియక విద్యార్థులు ఇబ్బందిపడటాన్ని మేం అంగీకరించం. ఇలాంటి విషయాల్లో విద్యార్థులను ముందే హెచ్చరించాలి. తల్లిదండ్రులకు స్తోమత ఉన్నప్పుడు పిల్లలను మంచి చదువుల కోసం దుబాయ్, లండన్, అమెరికాకు పంపొచ్చు. వారంతా ఇక్కడివారే అయినా కేవలం రెండేళ్లు బయట చదివారన్న కారణంతో ఎలా కాదంటారు? అందువల్ల కావాలనుకుంటే 2028 నుంచి స్థానికత నిబంధనను అమల్లోకి తీసుకురండి'' అని జస్టిస్ గవాయ్ సూచించారు.

# కాటన్ మాదిరి... కేసీఆర్ చరిత్రలో నిలిచిపోతారు

(మొదటిపేజీ తరువాయి)

కేసీఆర్ ను పోల్చారు. కాటన్ మాదిరిగానే కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించిన కేసీఆర్ కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఆయన అన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బ్రిటీష్ పాలనా కాలంలో ధవళేశ్వరం బ్యారేజీని ఆర్థర్ కాటన్ నిర్మించారని... రైతులకు మేలు జరగాలనే ఆకాంక్షతో ఉభయ గోదావరి జిల్లాలనకు సాగునీరు అందించారని హరీశ్ కొనియాడారు. ఆ రోజుల్లోనే కాటన్ మీద బ్రిటీష్ ప్రభుత్వం హెమింగ్టన్ కమిషన్ వేసిందని... ఆ కమిషన్ కాటన్ ను 900 ప్రశ్నలు అడిగి ఎంతో కాలం వేధించిందని తెలిపారు. అయినా, చివరకు ఏం జరిగింది? ఇప్పటికీ గోదావరి జిల్లాల ప్రజల గుండెల్లో కాటన్ నిలిచిపోయారని అన్నారు. అదే విధంగా చరిత్ర పుటల్లో తెలంగాణ ప్రజల గుండెల్లో కేసీఆర్ నిలిచిపోతారని చెప్పారు. తెలంగాణకు కాళేశ్వరం గుండెకాయ వంటిదని హరీశ్ అన్నారు. ఈ విషయం ముఖ్యమంత్రి రేవంత్ కు కూడా తెలుసని వ్యాఖ్యానించారు. మల్లన్నసాగర్ నుంచి మూసీలోకి నీళ్లు పోయడానికి రూ. 6 వేల కోట్లకు టెండర్లను ఫైనల్ చేశారని... మల్లన్నసాగర్ కాళేశ్వరంలో భాగమేనని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కాళేశ్వరం, మల్లన్నసాగర్ లాంటి ప్రాజెక్టును కేసీఆర్ నిర్మించారని చెప్పారు.

# మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

మధ్య కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ తీర్మానాన్ని ఎగువ సభలో ప్రవేశపెట్టారు. ఫిబ్రవరి 13న రాష్ట్రపతి రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద జారీ చేసిన మణిపూర్‌కు సంబంధించి ప్రకటన అమలులో కొనసాగింపు కింద అనే చట్టబద్ధమైన తీర్మానాన్ని సభ ఆమోదించింది. ఇప్పటికే జూలై 30న, మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను పొడిగించేందుకు లోక్‌సభ తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన కొన్ని రోజుల తర్వాత, ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించారు. దాదాపు రెండు నెలలుగా రాష్ట్రాన్ని పీడిస్తున్న హింస, రాజకీయ అస్థిరత మధ్య సింగ్ రాజీనామా చేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 356 కింద అమలులోకి వచ్చే ఈ నిర్ణయం ప్రకారం.. రాష్ట్రపతి పాలన పొడగించారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన భారత గెజిట్‌లో ప్రచురించబడిన ఈ ప్రకటన, మణిపూర్ శాసనసభ అధికారాలను పార్లమెంటుకు బదిలీ చేస్తుందని, రాష్ట్ర ప్రభుత్వ అధికారాన్ని సమర్థవంతంగా నిలిపి వేస్తుందని పేర్కొంది. ఈ ఉత్తర్వు ప్రకారం, గవర్నర్ అధికారాలను ఇప్పుడు రాష్ట్రపతి ఉపయోగిస్తారు. రాష్ట్ర శాసనసభ అధికారాన్ని పార్లమెంటు స్వీకరిస్తుంది. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేయలేనప్పుడు సాధారణంగా రాష్ట్రపతి పాలన విధిస్తారు. రాష్ట్రపతి పాలన విధించడం పార్లమెంటరీ ఆమోదానికి లోబడి ఆరు నెలల వరకు ఉంటుంది. ఈ కాలంలో, కేంద్ర ప్రభుత్వం పాలనను పర్యవేక్షిస్తుంది. కొత్త అసెంబ్లీని ఎన్నుకోవడానికి కొత్తగా ఎన్నికలు జరగవచ్చు. మణిపూర్‌లో జరిగిన అశాంతిలో ప్రధానంగా మెజారిటీ మెయిటీ కమ్యూనిటీ, మైనారిటీ కుకిజోమి తెగల మధ్య ఘర్షణలు జరిగాయి. ఆర్థిక ప్రయోజనాలు, ఉద్యోగ కోటాలు ఇంకా భూమి హక్కులకు సంబంధించిన వివాదాలపై ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ హింస వందలాది మంది మరణానికి దారితీసింది. సుమారు 60,000 మంది నిరాశ్రయులయ్యారు.

# నేడే కాంగ్రెస్ మహాధర్నా

హైదరాబాద్: రాష్ట్రంలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 17న అసెంబ్లీలో ఆమోదించి రాష్ట్రపతికి పంపిన బిల్లులకు వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో కాంగ్రెస్ బుధవారం దిల్లీలోని జంతర్‌మంతర్‌లో భారీ ధర్నా తలపెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం కోసం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు, పలు బీసీసంఘాల నాయకులు మంగళవారం దిల్లీకి తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ సోమవారమే కార్యకర్తలతో కలిసి ప్రత్యేక రైలులో చర్లపల్లి నుంచి దిల్లీకి బయలుదేరారు. మహాధర్నాను ఉదయం 10:30 గంటలకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రారంభిస్తారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొంటారు. ఇండియా కూటమిలో భాగంగా ఉన్న డీఎంకే, వామపక్షాలు, శివసేన యూబీటీ, ఎన్సీపీ (ఎస్పీ), ఆర్‌జేడీ, సమాజ్‌వాదీ తదితర పార్టీల నాయకులు హాజరై సంఘీభావం ప్రకటించనున్నట్లు తెలిసింది.

## చిన్న సాయమైనా సరే..

# కష్టాల్లో ఉన్న కుటుంబానికి అది కొండంత అండ

డబ్బుతో పని లేదు, స్పందించే మనసుంటే చాలు... పేదలకు అండగా నిలిచేందుకు అదే పెద్ద అర్హత... చిన్న సాయమైనా సరే, కష్టాల్లో ఉన్న కుటుంబానికి అది కొండంత భరోసా ఇస్తుంది... సరిగ్గా ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్‌లో పేదరికంపై సరికొత్త యుద్ధానికి రాష్ట్ర ప్రభుత్వం తెరలేపిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మానవతావాదుల భాగస్వామ్యాన్ని జోడిస్తూ 'పీ4' (ప్రజల భాగస్వామ్యంతో పురోగతి, పేదరిక నిర్మూలన) అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని వెల్లడించారు. 2029 నాటికి రాష్ట్రాన్ని శూన్య పేదరిక రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా, ఆగస్టు 19వ తేదీ నుంచి ఈ వినూత్న కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు నేడు ప్రకటించారు. మంగళవారం సచివాలయంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో సీఎం ఈ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఆర్థిక చేయూత అందుతున్నా, కొన్ని కుటుంబాలకు నైపుణ్యం, మార్గనిర్దేశం, మానసిక స్థైర్యం వంటి అదనపు తోడ్పాటు అవసరమని, ఆ లోటును 'మార్గదర్శకులు' భర్తీ చేస్తారని ఆయన అన్నారు.

**హేమలతే నిజమైన మార్గదర్శి!**

ఈ కార్యక్రమ స్ఫూర్తికి అసలైన నిర్వచనం చెప్పడానికి ముఖ్యమంత్రి అవనిగడ్డకు చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు హేమలత ఉదంతాన్ని ఉటంకించారు. "ఆమె ఆర్థికంగా నిరుపేద. అయినా తనకంటే కష్టాల్లో ఉన్న ఓ వృద్ధురాలికి అండగా నిలబడింది. రోజూ ఆమె ఇంటికెళ్లి సపర్యలు చేస్తోంది. ఇంతకంటే గొప్ప మానవత్వం ఏముంటుంది? డబ్బున్న వారే దానం చేయాలనేమీ లేదు. ఆదుకోవాలనే సంకల్పం ఉన్న ప్రతి ఒక్కరూ మార్గదర్శి కావచ్చు. హేమలత లాంటి వారే ఈ కార్యక్రమానికి నిజమైన స్ఫూర్తి ప్రదాతలు," అని సీఎం భావోద్వేగంతో ప్రశంసించారు.

**స్వచ్ఛందమే... ఒత్తిడికి తావులేదు!**

సమాజంలో స్థిరపడిన వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పేదరికంలో మగ్గుతున్న 'బంగారు కుటుంబాల'కు చేయూతనివ్వడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని సీఎం స్పష్టం చేశారు. మార్గదర్శుల ఎంపికలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, బలవంతాలకు తావుండకూడదని అధికారులకు గట్టిగా సూచించారు. "ఇది మానవత్వంతో ముడిపడిన కార్యక్రమం. మనసున్న వారే ముందుకు వస్తారు. గతంలో జన్మభూమి వంటి కార్యక్రమాలను విమర్శించినట్లే, దీన్నీ కొందరు నీరుగార్చాలని చూస్తారు. వాటిని పట్టించుకోవద్దు" అని ఆయన హితవు పలికారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, పీ4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రాణభయంతో మసూద్ అజహర్...

# రహస్య స్థావరాలకు తరలిస్తున్న పాక్ ఐఎస్ఐ!

భారత సైన్యం జరిపిన 'ఆపరేషన్ సిందూర్', 'ఆపరేషన్ మహాదేవ్' వంటి కీలక దాడులతో ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జేఈఎం) తీవ్రంగా దెబ్బతింది. ఈ నేపథ్యంలో, సంస్థ చీఫ్, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ మసూద్ అజహర్ ప్రాణభయంతో అజ్ఞాతంలోకి వెళ్లినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అతడిని భారత ఏజెన్సీల నుంచి కాపాడేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇందులో భాగంగా అజహర్ మకామును ఎప్పటికప్పుడు మారుస్తూ అత్యంత రహస్యంగా ఉంచుతోంది. 'ఆపరేషన్ సిందూర్' జైషే మహ్మద్ సంస్థను కోలుకోలేని దెబ్బతీసింది. ఈ ఆపరేషన్‌లో వంద మందికి పైగా ఉగ్రవాదులు హతమవడమే కాకుండా, బహవల్పూర్‌లోని జేఈఎం ప్రధాన కార్యాలయం పూర్తిగా ధ్వంసమైంది. అత్యంత ముఖ్యంగా, ఈ దాడిలో మసూద్ అజహర్ సోదరుడు రవూఫ్ అస్గర్‌తో సహా అతడి కుటుంబ సభ్యులు 10 మంది మరణించారు. ఈ పరిణామాలతో జైషే క్యాడర్ నైతిక స్థైర్యం పూర్తిగా పడిపోయిందని నిఘా వర్గాలు పేర్కొంటున్నాయి. లష్కరే తోయిబా వంటి ఇతర సంస్థలతో పోలిస్తే జైషే మహ్మద్ పరిస్థితి మరింత దయనీయంగా ఉన్నట్లు తెలుస్తోంది. దాడి జరిగిన వెంటనే ఐఎస్ఐ రంగంలోకి దిగి అజహర్‌ను బహవల్పూర్ నుంచి తరలించింది. తొలుత రావల్పిండిలోని ఓ రహస్య స్థావరంలో పది రోజుల పాటు ఉంచారు. ఆ తర్వాత, బహవల్పూర్‌కు సుమారు 1200 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిల్గిట్ బల్టిస్థాన్‌లోని స్కార్దూ ప్రాంతానికి తరలించారు. అక్కడ దాదాపు 20 రోజుల పాటు రెండు వేర్వేరు మసీదులు, ప్రభుత్వ, ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లలో అతడి మకామును మార్చుతూ వచ్చారు. బాలాకోట్ దాడుల సమయంలో తలదాచుకున్న పేశ్వర్‌లో కూడా అజహర్ కొన్నాళ్లు ఉన్నట్లు సమాచారం. మరోవైపు, అజహర్ అజ్ఞాతంలోకి వెళ్లడంతో తీవ్ర నిరాశలో ఉన్న తమ క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు జైషే సభ్యులు కొత్త ఎత్తుగడ వేశారు. అజహర్ పాత ఆడియో క్లిప్‌లను సోషల్ మీడియాలో సర్క్యులేట్ చేస్తూ, అవి కొత్తవని ప్రచారం చేస్తున్నారు. తమ నాయకుడు ఎక్కడికీ పారిపోలేదని, బహవల్పూర్‌లోనే ఉన్నాడని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్, హిజ్బుల్ ముజాహిదీన్ చీఫ్ సయ్యద్ సలాహుద్దీన్‌లను కూడా ఐఎస్ఐ ఇస్లామాబాద్‌లోని ఓ సురక్షిత ప్రాంతంలో ఉంచి కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తోందని నిఘా వర్గాలు తెలిపాయి. పుల్వామా దాడి, భారత పార్లమెంట్‌పై దాడి, ఐసీ814 విమానం హైజాక్ వంటి అనేక ఘాతుకాలకు మసూద్ అజహర్ సూత్రధారి అన్న విషయం తెలిసిందే.

## జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్...

# సత్యపాల్ మాలిక్ కన్నుమూత...

భారత రాజకీయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సీనియర్ నేత, జమ్మూకశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ (79) కన్నుమూశారు. దేశ రాజకీయాల్లో అత్యంత కీలకమైన ఆర్టికల్ 370 రద్దు సమయంలో జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసి ఆయన దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచారు. సుదీర్ఘకాలం అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు. 1960వ దశకంలో మీరట్‌లో విద్యార్థి నాయకుడిగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన సత్యపాల్ మాలిక్, ఐదు దశాబ్దాలకు పైగా ప్రజా జీవితంలోనే గడిపారు. ఉత్తరప్రదేశ్ శాసనసభ్యుడిగా, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, పర్యాటక శాఖ సహాయ మంత్రిగా పలు ఉన్నత పదవులను ఆయన అలంకరించారు. కాంగ్రెస్, జనతాదళ్, బీజేపీ వంటి పలు పార్టీలలో పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఆయన రాజకీయ జీవితంలో అత్యంత కీలకమైన, చరిత్రాత్మకమైన ఘట్టం జమ్మూకశ్మీర్ గవర్నర్‌గా పనిచేసిన కాలం. 2018 నుంచి 2019 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగారు. ఆయన హయాంలోనే కేంద్ర ప్రభుత్వం కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసింది. కశ్మీర్‌కు గవర్నర్‌గా వ్యవహరించిన సమయంలో ఆయన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసలతో పాటు విమర్శలను కూడా ఎదుర్కొన్నాయి. జమ్మూకశ్మీర్‌తో పాటు బీహార్, గోవా, మేఘాలయ రాష్ట్రాలకు కూడా సత్యపాల్ మాలిక్ గవర్నర్‌గా సేవలందించారు. గవర్నర్ పదవిలో ఉన్నప్పటికీ, ప్రజా సమస్యలపై, ముఖ్యంగా రైతుల హక్కుల కోసం ఆయన తరచూ గళం విప్పేవారు. కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను బహిరంగంగా విమర్శించి సంచలనం సృష్టించారు. తన చివరి రోజుల్లో క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ, సామాజిక న్యాయం, బడుగు వర్గాల సంక్షేమంపై తన

# బిఆర్‌ఎస్ అవినీతికి కాళేశ్వరం పెద్ద ఉదాహరణ

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిరదో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయ పాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో



పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడిరచారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు. ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు

# బీహార్‌లో ట్రంప్ పేరుతో నివాస ధృవపత్రానికి దరఖాస్తు!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బీహార్‌లో నివాసం ఉండాలనుకుంటున్నారా? ఆయనే స్వయంగా నివాస ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకున్నారా? బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లాలో వెలుగు చూసిన ఓ వింత ఘటన ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని అపహాస్యం చేసేందుకు కొందరు ఆకతాయిలు ఏకంగా ట్రంప్ పేరుతోనే నకిలీ దరఖాస్తు చేసి అధికారులకు షాక్ ఇచ్చారు. వివరాల్లోకి వెళితే, సమస్తిపూర్ జిల్లాలోని మొహియుద్దీన్‌నగర్ పరిధిలో జూలై 29న ఓ ఆన్‌లైన్ దరఖాస్తు అందింది. BRC CO/2025/17989735 నంబర్‌తో ఉన్న ఆ దరఖాస్తులో డొనాల్డ్ ట్రంప్ ఫొటో ఉంది. చిరునామాగా హసన్‌పూర్ గ్రామం, వార్డ్ నెం. 13, బకర్‌పూర్ పోస్ట్, మొహియుద్దీన్‌నగర్ పోలీస్ స్టేషన్ అని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును పరిశీలించిన అధికారులకు ఫొటో, ఆధార్ నంబర్, బార్‌కోడ్, చిరునామా వంటి వివరాలన్నీ తప్పుగా ఉన్నట్లు తేలింది. ఇది ఎవరో కావాలనే చేసిన పనిగా గుర్తించిన సర్కిల్ ఆఫీసర్ వెంటనే ఆ దరఖాస్తును తిరస్కరించారు. ప్రభుత్వ వ్యవస్థ పరువు తీసేందుకే ఈ చర్యకు పాల్పడ్డారని భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటనపై స్థానిక సైబర్ పోలీస్ స్టేషన్‌లో ఐటీ చట్టం కింద ఫిర్యాదు చేసినట్లు మొహియుద్దీన్‌నగర్ సీవో ధృవీకరించారు. "ఈ పనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. దరఖాస్తు చేసిన ఐపీ అడ్రస్, లాగిన్ వివరాల ఆధారంగా సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు" అని ఆయన వివరించారు.

# వర్గ పోరాటాలు నిర్మించడమే బోడేపుడికి ఘనమైన నివాళి

*** సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: దోపిడీ కి వ్యతిరేకంగా వర్గ రహిత సమాజం కోసం వర్గ పోరాటాల నిర్మించడమే బోడిపుడికి ఇచ్చే ఘనమైన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు స్థానిక మంచి కంటి భవన్లో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు మధిర మాజీ ఎమ్మెల్యే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిపిఎం రాష్ట్ర నాయకులు బోడిపూడి వెంకటేశ్వరరావు వర్ధంతి కార్యక్రమం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు అధ్యక్షతన జరిగింది. ముందుగా బోడిపూడి చిత్రపటానికి పూలమాలవేసి మచ్చా వెంకటేశ్వర్లు నివాళులర్పించారు అనంతరం ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టి చిరు ప్రాయంలోనే పాలేరు గా జీవితం ప్రారంభించి, బడిపంతులు గా జీవితం కొనసాగించారన్నారు. కష్టజీవుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ప్రభావం తో ఎర్రజెండా చేత పట్టి కడవరకు ప్రజల గొంతుకై చట్ట సభలో ప్రజా పోరాటాలలో నిలిచాడని అన్నారు.ఉత్తర ప్రత్యుత్తరాలు చేరవేసే కొరియర్ భాధ్యత తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో నిర్వహించారనీ గుర్తుచేశారు. సిపిఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, శాసనసభ సిపిఎం పక్ష నేత గా బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాడని ఎన్నికలలో



మూడు పర్యాయాలు ఓడినా,మూడు పర్యాయాలు వరుసగా గెలిచిన కుంగుబాటు, పొంగుబాటు లేని నికార్సయిన ఎర్రజెండా బిడ్డ కామ్రేడ్ బోడేపూడి అని కొనియాడారు.ప్రజా పోరాటాలు, కమ్యూనిస్టు ఉద్యమం సవాళ్ళు ఎదుర్కొంటున్న నేటి పరిస్థితుల్లో బోడేపూడి లాంటి కమ్యూనిస్టు యోధులు నాటి సామాజిక పరిస్థితులలో మార్పు కోసం, వర్గ, సామాజిక పోరాటాలు నిర్వహించి ప్రజల ఆదరణ పొందిన తీరు అధ్యయనం చేయాలనీ ఆయన నేటి తరానికి సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ నాయకులు వై వెంకటేశ్వరరావు అభిమన్యు సలీం విజయమోహన్ సింగ్ రసూల్ బి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ నుండి వస్తున్న కాలుష్య జలాలను అడ్డుకోండి




జిన్నారం,ప్రజాస్ఫూర్తి 05: ఎంఎస్ఎన్ మైత్రి ల్యాబ్స్ గేటు ముందు నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించడమే కాకుండా వాటి ద్వారా కాలుష్య విషపూరితమైన వ్యర్థ జలాలు పంపించేస్తున్నారని తక్షణమే వాటిని తొలగించాలని గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ కి గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన కమిషనర్ సిబ్బందిని పంపి డ్రైనేజీకి అడ్డుకట్ట వేయించారు.విషపూరిత కాలుష్య జలాలు రాకుండా చర్యలు పిసిబి అధికారులు తీసుకోవాలని గ్రామానికి చెందిన కొడకంచి అర్జున్, నీరుడి శ్రీనివాస్, కొడకంచి నవీన్, డిమాండ్ చేశారు.

## వీరన్నగూడెంలో తల్లిపాల వారోత్సవాలు



జిన్నారం(గుమ్మడిదల) ప్రజాస్ఫూర్తి05: తల్లిపాల వారోత్సవాలలో భాగంగా గర్భిణీ,బాలింతలకు అవగాహన కల్పించారు.గుమ్మడిదల మండలం వీరన్నగూడెంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.రెండు సంవత్సరాల లోపు పిల్లల తల్లులకు ముర్రు పాల ప్రాముఖ్యత వల్ల కలిగే లాభాలను వివరించారు.ఆరు నెలలలోపు పిల్లలకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు.ఏడు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు అనుబంధ పోషకాహారం అందించాలని, అంగన్వాడీ లో పెట్టే ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.కార్యక్రమంలో కవిత, శారద,శివరాణి స్వప్న పోచమ్మ,పాల్గొన్నారు.

## భద్రాద్రి కొత్తగూడెంలో అరుదైన సర్పం పట్టివేత



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో అరుదైన సర్పం సంచారం కలకలం రేపింది. మణుగూరు సింగరేణి బంగ్లాస్ క్వార్టర్స్‌లో సోమవారం రాత్రి 11 గంటల సమయంలో పాము కనిపించిందని అక్కడి ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ప్రాణధార ట్రస్ట్ స్నేక్ రెస్క్యూ సభ్యుడు ముజఫర్‌కు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన ముజఫర్, పామును జాగ్రత్తగా పట్టుకున్నాడు. అయితే ఆ పాము రకాన్ని తానూ ఇంతకుముందు చూడలేదన్న సందేహంతో, ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు, స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ జిమ్ సంతోష్‌ను సంప్రదించారు. సంతోష్ పరిశీలించి అది అత్యంత అరుదైన బాండెడ్ క్రైట్ స్నేక్ అని గుర్తించారు. ఇది కట్లపాము కుటుంబానికి చెందినదిగా, శక్తివంతమైన హిమోటాక్సిన్ విషాన్ని కలిగి ఉంటుందని తెలిపారు. ఈ సర్పం శరీరం మూడు పలకల మాదిరిగా ఉండి, పసుపునలుపు చారలతో ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. రాత్రివేళలే సంచరిస్తుందని, సాధారణంగా ములుగు, ఏటూరునాగారం ప్రాంతాల్లో మాత్రమే కనిపించేదని వివరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఇదే తొలిసారిగా ఈ జాతి పాము కనిపించడం గమనార్హం.ఈ సందర్భంగా స్థానికులు ముజఫర్‌ను అభినందించగా, ట్రస్ట్ తరపున సంతోష్ కూడా అతని పనితీరును ప్రశంసించారు.




## విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

*** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి**

ప్రజాస్ఫూర్తి , కాప్రా :విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపుతూ,పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించాలంటూ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. జిల్లాలోని కుషాయిగూడలో ఉన్న తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజ్ (గర్ల్స్), కుత్బుల్లాపూర్ వసతి గృహాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సంఖ్యను, వారి హాజరు వివరాలను కలెక్టర్ పరిశీలించారు. స్టోర్ రూమ్, వంటగది, ఆహారం తనిఖీ చేశారు. విద్యార్థుల స్టడీ అవర్ లో ఏయే సబ్జెక్టులు చదువుతున్నారు, ఎలా సిద్ధమవుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. వారు ఆటలు ఆడే విషయాన్ని, భవిష్యత్తులో ఏం కావాలని ఆశిస్తున్నారు అన్న విషయాలపై విద్యార్థులతో సంభాషించారు. కలెక్టర్ విద్యార్థులకు మంచి ఉత్సాహాన్ని కలిగించే మాటలు చెప్పారు. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే విషయాలను పంచుకున్నారు. విద్యపై ఇష్టం పెరిగేలా చదవాలని, మానసిక ఒత్తిడికి లోనవకూడదని సూచించారు. వెనుకబడి ఉన్న సబ్జెక్టులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని,



లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని విద్యార్థులను ప్రోత్సహించారు.ఆహారం అంశంలో కలెక్టర్ మెనూ ప్రకారం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజనం అందుతున్నాయా అన్నదానిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలని విద్యార్థులకు చెప్పారు. వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భనలో జిల్లా మైనార్టీ శాఖ అధికారి కాంతమ్మ, కాప్రా ఎమ్మార్వో సుచరిత, ప్రిన్సిపల్ సునీత రాణి తదితర అధికారులు పాల్గొన్నారు.



## లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికే.. సబ్ స్టేషన్

- **నా హస్తవాసి మంచిది.. ప్రభుత్వం ఏర్పడింది**
- **ఎనగంటి తండాలో సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన**
- **మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి**

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రైతులు ఎదుర్కొంటున్న లో వోల్టేజ్ సమస్య పరిష్కారానికే నియోజకవర్గ వ్యాప్తంగా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేశామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం ఎనగంటి తండా గ్రామ పంచాయతీ పరిధిలో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ కు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా లో వోల్టేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నానన్నారు. అందులో భాగంగానే నూతన సబ్ స్టేషన్ల ప్రారంభంతో పాటు నూతన సబ్ స్టేషన్ ఏర్పాటుకు శంకుస్థాపన చేశానన్నారు. ఎనగంటి తండాలో నూతన సబ్ స్టేషన్ త్వరితగతన పూర్తి చేసి లో వోల్టేజ్ సమస్య లేకుండా రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తానన్నారు. శంకుస్థాపన సందర్భంగా కొబ్బరికాయ



కొట్టే క్రమంలో తన హస్తవాసి మంచిదని.. కాబట్టే తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, త్వరలోనే సబ్ స్టేషన్ నిర్మాణం కూడా పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, ట్రాన్స్ కో ఎస్ఈ సుదీర్ బాబు, డీఈ మల్లికార్జున్, ఏడీ పద్మ, తహసిల్దార్ వీరాబాయి, ఏఈ సతీష్, ఆర్ ఐ బాణాల రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తాడూరు వెంకట్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి చిలుకూరు ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మాజీ సర్పంచ్ లు పబ్బు రాజు గౌడ్, కొలను శ్రీనివాస్ రెడ్డి, బక్క స్వప్న శ్రీనాథ్, సుర్వి నరసింహ గౌడ్, నాయకులు వరకాంతం జంగారెడ్డి, సురుగు శ్రీనివాస్, అర్థ వెంకట్ రెడ్డి, ఆంగోత్ శ్రీనివాస్ నాయక్, మాచర్ల సంతోష్ కుమార్, ఎర్రగుంట వెంకటేష్, బోయపల్లి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జీడిమెట్ల ఎస్సై ప్రేమ్ సాగర్ కు అభినందనలు

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : రెండవ తెలంగాణ స్టేట్ పోలీస్ డ్యూటీ మీట్ లో జీడిమెట్ల ఎస్సై ప్రేమ్ సాగర్ అద్భుత ప్రతిభ కనబరిచారు. ఇటీవల జరిగిన తెలంగాణ సెకండ్ స్టేట్ పోల్ పోలీస్ డ్యూటీ మీటిలో క్రిమినల్ లాస్ లో గోల్డ్ మెడల్ లిఫ్టింగ్ ప్యాకింగ్ ఫార్వార్డింగ్ లో జీడిమెట్ల ఎస్సై ప్రేమ్ సాగర్ సిల్వర్ మెడల్ , మెడికల్ లో సిల్వర్ మెడల్ సాధించారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సైబరాబాద్ శాంక్షన్ షిప్ గా నిలవడంలో ప్రముఖ భూమిక పోషిస్తున్నటువంటి ఎస్ఐ ప్రేమ్ సాగర్ ని సైబరాబాద్ సిపి అవినాష్ మాంతి , బాలానగర్ జోన్ డిసిపి కే సురేష్ కుమార్, బాలానగర్ ఎసిపి నరేష్ రెడ్డి , జీడిమెట్ల ఎస్ హెచ్ఓ ,. జీడిమెట్ల సిబ్బంది అభినందించారు. ఈ సంవత్సరం పూణేలో జరిగే జాతీయ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్లో పాల్గొని ఇలాగే మెడల్ సాధించాలన్నారు. అనంతరం పోలీస్ సిబ్బంది , జీడిమెట్ల ప్రాంత ప్రముఖులు ఎస్ఐ ప్రేమ్ సాగర్ ని అభినందించారు.

## డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి

*** ఎర్రబెల్లి సతీష్ రావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారి గోవింద్ హోటల్ చౌరస్తా నుండి జయ నగర్ కాలనీ లోకి డ్రైనేజీ నీరు పొంగి రోడ్ల మీద ప్రవహిస్తుండడంతో విషయం తెలుసుకున్న ఆయన మంగళవారం ఆయా ప్రాంతాలలో జయనగర్ కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మురుగునీరు ఏరులై పారుతుండడంతో కాలనీ వాసులు, వాహనదారుల రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతున్నారన్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది కేవలం తాత్కాలిక మరమ్మతులు మాత్రమే చేసి నీటిని కొన్ని రోజులవరకు మాత్రమే రాకుండా ఆపుతున్నారని, శాశ్వతంగా పరిష్కారం అయ్యేలా చేయట్లేదు కాలనీ వాసులే కాకుండా ఆ రోడ్డు నుండి వెళ్లే ప్రయాణికులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాములు గౌడ్ , కళ్యాణ్, చేజర్ల రాములు, సాయి గౌడ్, అరుణ్ రెడ్డి , జయనగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యేకు ఘన స్వాగతం

- **మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండలం ఎనగంటి తండా గ్రామపంచాయతీ పరిధిలో 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభానికి వచ్చిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి అల్లాపురం మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి మంగళవారం ఘన స్వాగతం పలికారు. శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పెండింగ్ లో ఉన్న సర్పంచుల బిల్లులను విడుదల చేసేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ప్రభుత్వానికి నివేదిస్తానని హామీ ఇచ్చారు.

## బిసి 42% రిజర్వేషన్ సాధనకు ఢిల్లీ బయలుదేరిన ఎమ్మెల్యే కోరం కనకయ్య



ప్రజాస్ఫూర్తి, ఇల్లందు :తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి పిలుపు మేరకు బిసి 42% రిజర్వేషన్ సాధన కొరకు బిజేపి ప్రభుత్వంకు కనువిప్పు కలిగించేందుకు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసన ధర్నా కార్యక్రమానికి నియోజకవర్గ కాంగ్రెస్ నేతలతో కలిసి ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య కదిలివెళ్ళారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, బయ్యారం సొసైటి చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి,బయ్యారం మండల నాయకులు ప్రవీణ్ నాయక్,సిసి రాజేష్, తదితరులు ఉన్నారు.

# త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నా

*** బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

జీడిమెట్ల, (ప్రజాస్ఫూర్తి) : , త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపడుతున్నామని బిఆర్ఎస్ ఎల్పీ విప్,కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. సూరారం డివి జన్ పరిధిలోని పలు కాలనీలవాసులు పేట్ బషీరా బాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని కలిసి మంజీరా నీటి సరఫరా, త్రాగునీటి సమస్యపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ రోజురోజుకు విస్తరిస్తున్న నగరానికి, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మంచి నీరు అందించేలా అన్నారు. అనంతరం జలమండలి అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా అధికారులు సమన్వయంతో



పనిచేస్తూ గతంలో మాదిరిగా నీటిని సరఫరా చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, డివిజన్ యూత్ అధ్యక్షులు దొడ్ల శ్రీనివాస్, సంక్షేమ సంఘాల సభ్యులు కె. శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, దారం శివ గుప్తా, యాదయ్య గౌడ్, బషీర్, సురేష్ బాబు, సురేష్, చంద్రశేఖర్, అమృత, లత, లక్ష్మీ, రమేష్, మహేష్, సత్తి, సదానందం, జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్..**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో ప్లాంటేషన్ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యాచందనతో కలిసి ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఆవరణలో జరుగుతున్న చెట్లు తొలగింపు ,పరిసరాల క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆవరణలో నిర్మించబోవు భవనాల, కంప్యూటర్ ల్యాబ్లు, తరగతి గదులు వాటికి అనుగుణంగా ప్రదేశాన్ని చదును చేయాలని సూచించారు. యూనివర్సిటీ ఆవరణలో ఖాళీ ప్రదేశంలో విస్తృతంగా ప్లాంటేషన్ ప్రక్రియ చేపట్టాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించే పనస, టెకోమో, తెల్ల గన్నేరు , మందారం మొక్కలను విస్తృతంగా నాటాలని ఆదేశించారు. యూనివర్సిటీ ఆవరణ అంతా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట పాల్వంచ మునిసిపల్ కమిషనర్ సుజాత, ఇంజనీరింగ్ సిబ్బంది, యూనివర్సిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ఆశా వర్కర్లకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి

**- భూక్యా రమేష్ డిమాండ్**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ప్రజల కోసం నిరంతరం కష్టపడుతు, వారి ఆరోగ్య క్షేమాలు కంటికి రెప్పలా కాపాడుతున్న ఆశా వర్కర్లకు కనీస వేతనం 26000 ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు భూక్యా రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా డే ల సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన మీటింగ్లలో భూక్య రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను ఆశ వర్కర్ల చేత చేపిస్తూ, వారి శ్రమను గుర్తించకుండా కనీస వేతనాలు అమలు చేయకుండా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము చెల్లిస్తున్నట్లూ ఫిక్స్డ వేతనం కూడా ఇవ్వకుండా పారితోషికాల పేరుతోటి వేతనం చెల్లించడం సరైనది కాదన్నారు. ఫిక్స్డ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు కనీస వేతనం 26,000 ఇచ్చేవరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన హెచ్చరించారు. ఈఎస్ఐపిఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్కీం వర్కర్ల పేరుతోటి ఎన్ హెచ్ ఎం స్కీంకు నిధులు తక్కువ కేటాయించి ఆశా వర్కర్ల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లెల చేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి ని ఐక్యంగా ఎండగట్టాలన్నారు. ఆశా వర్కర్లంతా ఐక్యంగా పోరాటం చేస్తూ ముందుకు సాగాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు లిక్కి బాలరాజు, రామ సీత, గంగ, లత, ప్రమీల, తదితరులు పాల్గొన్నారు

## పట్టపగలే రౌడీషీటర్ దారుణ హత్య



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : నేరాలతో సహజీవనం చేసిన రౌడీషీటర్ ను పట్టపగలే రోడ్డుపై కత్తులతో దాడిచేసి అంతమొందించడం కలకలం రేకెత్తించింది. మంగళవారం బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో గుడ్విలి హోటల్ కొనసాగుతోంది. ఓ వ్యక్తి టీతాగుతుండగా మంగళవారం సాయంత్రం ఆటోలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేశారు. ఆపై హోటల్ బయటకు తీసుకువచ్చి కత్తులతో దారుణంగా దాడిచేశారు. సంఘటనలో బాధితుడు మహబూబ్ (35) తీవ్రంగా గాయపడి సంఘటనాస్థలంలోనే చనిపోయాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సంఘటనలో చనిపోయింది ముషీరాబాద్కు చెందిన రౌడీషీటర్ మహబూబ్ గా గుర్తించారు. ఇతనిపై దొంగతనం, హత్య సహా 13 కేసులున్నాయని డీసీపీ తెలిపారు. హత్యకు కారణాలు నిందితులకోసం దర్యాప్తు చేస్తున్నన్నట్టు వెల్లడించారు. ఈమేరకు మృతదేహాన్నిగాంధీకి తరలించి జగద్గిరిగుట్ట పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## రాత్రి షిఫ్టుల్లోనూ ఆ రాష్ట్రంలో మహిళలకు అనుమతి.. అయితే, ఒక షరతు!



మహిళా ఉద్యోగుల విషయంలో ఒడిశా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాత్రి వేళల్లో మహిళలు విధులు నిర్వర్తించేలా అనుమతించింది. పరిశ్రమలు, దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల్లో వారు రాత్రి షిఫ్టుల్లో పనిచేయడానికి అనుమతిస్తూ లేబర్ అండ్ ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ డిపార్ట్మెంట్ మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఒక షరతు విధించింది.

* ఆ షిఫ్టులో కనీసం ముగ్గురు మహిళా ఉద్యోగులు ఉండాలి.
* జీపీఎస్ ట్రాకింగ్తో కూడిన వాహనంలో వారికి రవాణా సౌకర్యం కల్పించాలి.
* యుక్త వయసులో ఉన్న మహిళలకు ఈ అనుమతి లేదు.
* పని ప్రదేశానికి దగ్గర్లో వాష్రూమ్, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి. సీసీటీవీ నిఘా, తగినంత లైటింగ్ ఉండాలి.
* అయితే ఈ నైట్ షిఫ్ట్కు అనుమతించేముందు సదరు మహిళల నుంచి రాతపూర్వక సమ్మతి తప్పనిసరని ప్రభుత్వం ఆ నోటిఫికేషన్లో పేర్కొంది. ఈ నిర్ణయం మహిళలకు ఉద్యోగ అవకాశాలు పెరగడానికి దోహదం చేస్తుందని పేర్కొంది. ఇటీవల ఒడిశా ప్రభుత్వం షాప్స్ అండ్ కమర్షియల్ ఎస్టాబ్లిష్మెంట్స్ యాక్ట్ను సవరించింది. దీనికిందే మహిళలు రాత్రిపూట విధులు నిర్వర్తించేందుకు ఓకే చెప్పింది. కేంద్రం నుంచి వచ్చిన సూచనల మేరకు తాము ఈ నిర్ణయం తీసుకున్నామని కార్మిక శాఖ మంత్రి వెల్లడించారు. అయితే విపక్షాలు మాత్రం ప్రభుత్వం పెట్టిన షరతును విమర్శిస్తున్నాయి. "మహిళలు రాతపూర్వక అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అంటే వారు తమను తాము రక్షించుకోవాలనా? దీనిద్వారా ప్రభుత్వం తన బాధ్యతను విస్మరించాలని చూస్తోంది" అని బిజూ జనతాదళ్ విమర్శించింది.

## సుందర ధరాలీలో బురద వరద విలయం..!

ఉత్తరాఖండ్లోని ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా ఉండే ధరాలీ గ్రామం మెరుపు వరదలకు పూర్తిగా కొట్టుకుపోయింది. సముద్రం మీద పడిందా అన్న స్థాయిలో మేఘం వర్షించింది. దీంతో నీరు, అక్కడున్న మట్టి కలిసి భారీ ఎత్తున బురద వరద ధరాలిని కప్పేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రదేశం మరు భూమిని తలపిస్తోంది.



### ఎక్కడుందీ గ్రామం..?

చార్ధామ్ యాత్రికులు ఎక్కువగా ఈ గ్రామాన్ని సందర్శిస్తుంటారు. యాపిల్స్కు ప్రసిద్ధిగాంచిన ఉత్తరాఖండ్లోని హర్సిల్ లోయ ఇక్కడకు కేవలం 6 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇది ఉత్తరాఖండ్లో మారుమూల ఉన్న అత్యంత రమ్యమైన ప్రదేశాల్లో ఒకటి. దీని సమీపం నుంచే భాగీరథి నది ప్రవహిస్తోంది. రిషికేశ్ నుంచి బయల్దేరి చంబా, ఉత్తరకాశీ, హర్సిల్ మీదుగా ఇక్కడికి వెళ్లవచ్చు. సముద్రమట్టానికి దాదాపు 2,680 మీటర్ల ఎత్తున ఈ ప్రదేశం ఉంది. ఇక్కడి నుంచి గంగోత్రి ధామ్ కేవలం 20 కిలోమీటర్ల దూరం. గ్రామం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతుంది. చార్ధామ్ సహా ఇతర తీర్థయాత్రల సీజన్లో ధరాలీ గ్రామానికి సందర్శకులు భారీ సంఖ్యలో వస్తుంటారు. ఇక్కడ పెద్ద సంఖ్యలో లాడ్జిలు, అతిథి గృహాలున్నాయి. తక్కువ ధరలకే వసతి లభిస్తుండటంతో.. యాత్రికులు వీటి వైపు మొగ్గుచూపుతారు. ఇక్కడి నుంచి 32 కిలోమీటర్ల దూరంలో నీలాంగ్ లోయ ఉంది. భారత్టిబెట్ మధ్య వ్యాపారం జరిగే పాత మార్గం ఇక్కడి నుంచి వెళుతుంది. ఇక్కడ రాత్రిళ్లు బస చేయడానికి అనుమతి లేదు. ఈ ప్రదేశాలను వీక్షించాలన్నా అటవీశాఖ అనుమతి ఉండాలి. ఇక ధరాలీ సమీపంలోని హార్సిల్ లోయలో భారీ విస్తీర్ణంలో యాపిల్ తోటలున్నాయి. చార్ధామ్ యాత్రికులు గంగోత్రికి వెళ్లే సమయంలో ఇక్కడ ఉండేందుకు ఇష్టపడతారు. కేదార్ తాల్ ప్రదేశానికి ట్రెక్కింగ్కు వెళ్లేవారికి ఈ ప్రాంతం బేస్క్యాంప్గా ఉంటుంది.

### మెరుపు వరద ఇలా..

ధరాలీ గ్రామం సమీపంలోని ఖీర్గఢ్ నదీ పరివాహక ప్రదేశంలో భారీ వర్షం కారణంగా నీరు నిలిచింది. ఇది ఒక్కసారిగా ధరాలీ మార్కెట్ ప్రదేశంపై విరుచుకుపడింది. ఆగస్టు 10వ తేదీ వరకు ఉత్తరాఖండ్లో భారీ వర్షాలు కురుస్తాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. తాజాగా చోటుచేసుకున్న మెరుపు వరదల్లో 20 నుంచి 25 హోటళ్లు, హోమ్స్టేలు కొట్టుకుపోయాయి. అతి తక్కువ సమయంలో అత్యంత తీవ్రమైన వర్షపాతం నమోదు కావడాన్ని క్లౌడ్ బరస్ట్ అంటారు. ముఖ్యంగా గంటలోపు 20 నుంచి 30 కిలోమీటర్ల పరిధిలో 10 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిస్తే దానిని క్లౌడ్ బరస్ట్గా పేర్కొంటుంటారు. ఇక 5 సెంటీమీటర్ల కంటే తక్కువ ఉంటే వాటిని మినీ క్లౌడ్ బరస్ట్గా పేర్కొంటాం. ఇటువంటి వర్షాలు సాధారణంగా పర్వతాలు, కొండ ప్రదేశాల్లో కురుస్తుంటాయి. ముఖ్యంగా హిమాలయాల్లో తరచూ వీటిని చూడొచ్చు.

# 'ఆయుష్మాన్ కార్డు' ఉన్నా.. వైద్యం నిరాకరిస్తున్నారా?

'ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన' పథకం కింద పేద, ధనిక తేడా లేకుండా దేశవ్యాప్తంగా 70 ఏళ్లు పైబడిన వారందరికీ రూ.5 లక్షల ఉచిత వార్షిక ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తోన్న విషయం తెలిసిందే. అయితే, 'ఆయుష్మాన్ కార్డులు' (Ayushman Card) ఉన్నప్పటికీ.. కొన్ని ఆస్పత్రులు వైద్యం చేసేందుకు నిరాకరిస్తున్నాయన్న విమర్శలూ వస్తున్నాయి. 70ఏళ్ల వయసులో చికిత్స అందించి ఒకవేళ విఫలమైతే ఆస్పత్రికి చెడ్డ పేరు వస్తుందని కొందరు, బిల్లు కోసం వేచి చూడాలన్న ధోరణిలో మరికొందరు.. ఇలా కారణాలు ఏమైనా చికిత్స అందించేందుకు మాత్రం వెనకడుగు వేస్తున్నారు. యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నప్పటికీ.. ఈ తరహా ఘటనలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. అయితే, వైద్యం అందించేందుకు ఆస్పత్రి యాజమాన్యం నిరాకరిస్తే.. నేరుగా పోర్టల్ ద్వారానే ఫిర్యాదు చేయవచ్చు. తమ సమస్యను నేరుగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లొచ్చు.

*** ఆన్లైన్లో ఫిర్యాదు చేయడం ఎలా?**

* తొలుత https://cgrms.pmjay.gov.in/GRMS/loginnew.htm వెబ్సైట్లోకి వెళ్లాలి.
* 'రిజిస్టర్ యువర్ గ్రివెన్స్' ఆప్షన్పై క్లిక్ చేయాలి.
* క్యాప్చా కోడ్ను ఎంటర్ చేసి.. ఏ పథకం ద్వారా మీకు వైద్యం అందడంలేదో డ్రాప్డౌన్ లిస్టు నుంచి దాన్ని ఎంపిక చేసుకోవాలి.
* మిగతా సమచారాన్ని కూడా నింపి.. ఫిర్యాదును రిజిస్టర్ చేయొచ్చు.
* ఒకవేళ అలా సాధ్యం కాకపోతే.. నేషనల్ టోల్ఫ్రీ హెల్ప్లైన్ నెంబర్ 14555, 1800 114477 లేదంటే ఆయా రాష్ట్రాలకు చెందిన సహాయక కేంద్రాలకు కూడా ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు.
* ఉమాంగ్ యాప్ ఉంటే.. అందులో ఆయుష్మాన్ భారత్...> గ్రివెన్స్ రెడ్రెసల్ ( ఫిర్యాదుల పరిష్కారం) ఆప్షన్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

**ఫిర్యాదు చేసే ముందు..**

* ఆస్పత్రి వర్గాలు వైద్యం నిరాకరించాయని రుజువు చేసేందుకు వీలుగా ఒక ఫొటోగానీ, వీడియోగానీ ఉంచుకోవడం మంచిది.
* ఆయుష్మాన్ కార్డు, అప్పటికే ఆస్పత్రిలో చేరితే దానికి సంబంధించిన రికార్డులు దగ్గర పెట్టుకోవాలి.
* ఫిర్యాదు చేసిన తర్వాత గ్రివెన్స్ ఐడీ నెంబర్ను జాగ్రత్తగా భద్రపరచుకోవాలి. ఒకవేళ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోతే.. ఫాలోఅప్ చేసేందుకు వీలుంటుంది.

*** ఆయుష్మాన్ భారత్ కార్డు పొందడం ఎలా?**

ఏబీపీఎంజేఏవై పథకంలో లబ్ధి పొందేందుకు పీఎంజేఏవై పోర్టల్ లేదా ఆయుష్మాన్ యాప్లో దరఖాస్తు చేసుకోవచ్చు. PMJAY పోర్టల్లో 'యామ్ ఐ ఎలిజిబుల్' ట్యాబ్పై క్లిక్ చేయాలి. దీంతో beneficiary.nha.gov.in అనే వెబ్సైట్కి రీడైరెక్ట్ అవుతారు. అక్కడ క్యాప్చా, మొబైల్ నంబర్, ఓటీపీ ఎంటర్ చేయాలి. తర్వాత కేవైసీ కోసం వివరాలు నమోదు చేసి.. ఆమోదం కోసం చూడాలి. ఆయుష్మాన్ కార్డు సిద్ధమైన తర్వాత అధికారిక ఆమోదం లభించిన వెంటనే బీమా కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు. ఆధార్లో నమోదైన వయసు ఆధారంగా దరఖాస్తు చేసుకోవచ్చు.

**కార్డు వల్ల ఉపయోగమేంటి?**




ఆయుష్మాన్ కార్డు ఉన్న వృద్ధులు కుటుంబ ప్రాతిపదికన ఏటా రూ.5 లక్షల వరకు లబ్ధి పొందొచ్చు. అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు చెందిన వృద్ధులకు వైద్యబీమా లభిస్తుంది. దీనికింద దరఖాస్తు చేసుకున్న వృద్ధులకు కొత్త కార్డులు అందిస్తారు. ఇప్పటికే ఆయుష్మాన్ భారత్ పరిధిలో ఉన్న వృద్ధులకు ఇప్పుడు రూ.5 లక్షల అదనపు కవరేజీ లభిస్తుంది. కుటుంబంలో 70 ఏళ్లపైబడిన వారు ఇద్దరు ఉంటే వారికి సగం, సగం ప్రయోజనం వర్తిస్తుంది. సీజీహెచ్ఎస్, ఎక్స్సర్వీస్మెన్ కాంట్రిబ్యూటరీ హెల్త్స్కీం, ఆయుష్మాన్ సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్ పథకాల కింద ఉన్న వయో వృద్ధులు వాటిని గానీ, ఏబీపీఎంజేఏవైని (ABPMJAY) గానీ ఎంచుకోవచ్చు. ప్రైవేటు వైద్యఆరోగ్య బీమా, కార్మిక రాజ్య బీమా కింద ప్రయోజనం పొందుతున్నవారూ ఈ రూ.5 లక్షల ప్రయోజనం పొందొచ్చు.

# గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో 'కాళేశ్వరం' నివేదిక ద్వారా తెలిసింది

**: మంత్రి పొంగులేటి**

ఖమ్మం: కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గత ప్రభుత్వం ఎంత అవినీతికి పాల్పడిందో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ద్వారా తెలిసిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల కాళేశ్వరం కమిషన్ తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో మంత్రి స్పందించారు. మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో మంత్రి పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమన్నారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 5 లక్షల కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేశామన్నారు. రాబోయే ఏ ఎన్నికల్లో అయినా ఇందిరమ్మ ప్రభుత్వానికి అండగా ఉండాలని ప్రజలను కోరారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో పేదవాడి కోసం అన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. తిరుమలాయపాలెం మండలానికి



ఒక ఐటీఐ కళాశాల మంజూరు చేశామని, ప్రభుత్వ ఆసుపత్రికి ఆధునికీకరణ చేస్తున్నామని వెల్లడించారు. మండల అభివృద్ధికి రూ.75 కోట్లు కేటాయించామన్నారు. పేదవాడి ఆకలి తీర్చే ఉద్దేశంతో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ధరణి పోర్టల్‌ను రద్దు చేశామని.. పేద రైతుల కోసం భూభారతి తీసుకొచ్చామన్నారు.

**బాలికలకు సైకిళ్ల పంపిణీ..**

ఏదులాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ, 1, 59, 60వ డివిజన్లకు చెందిన 8వ తరగతి బాలికలకు మంత్రి సైకిళ్లు పంపిణీ చేశారు. పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున మంగళవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వచ్చే ఏడాది నుంచి స్కూల్ విద్యార్థులతో పాటు జూనియర్ కాలేజీ విద్యార్థులకు కూడా సైకిళ్లు ఇవ్వబోతున్నట్లు చెప్పారు.

## ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు.. వనస్థలిపురంలో పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య

హైదరాబాద్: ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు తీర్చలేక పోస్టల్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ ఘటన చోటుచేసుకుంది. బెట్టింగ్ గేమ్స్ ఆడకుండా ఉండలేక.. అప్పులు తీర్చలేక ప్రాణాలను తీసుకుంటున్నట్లు మృతుడు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన నరేశ్.. భార్య కీర్తి, కుమార్తె భవ్యతో కలిసి వనస్థలిపురంలోని ఓ కాలనీలో నివాసముంటున్నారు. కొన్నేళ్లుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ఆర్థికంగా నష్టపోయిన నరేశ్.. సుమారు రూ.15లక్షలు అప్పు చేసినట్లు సమాచారం. ఇటీవల అనారోగ్యంతో ఇంట్లో ఉంటున్న నరేశ్.. అప్పులు తీర్చే మార్గంలేక



మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## వినియోగానికి తగినట్లు యూరియా సరఫరా చేయండి.. కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ

హైదరాబాద్: రాష్ట్రంలో ఆగస్టు నెలలో యూరియా వినియోగం ఎక్కువగా ఉంటుందని, దీనికి అనుగుణంగా సరఫరా చేయాలని కేంద్రానికి తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర రసాయన, ఎరువులశాఖ మంత్రి జేపీ నడ్డాకు ఆయన లేఖ రాశారు. "ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 1.09 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయి. ఆగస్టు నెలలో పంటలకు అత్యధిక వినియోగం దృష్టిలో ఉంచుకుని కనీసం 3 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవుతోందని అంచనా. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు రాష్ట్రానికి 6.60 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా



చేయాల్సి ఉండగా.. ఇప్పటి వరకు కేవలం 4.51 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా మాత్రమే జరిగింది. ఏప్రిల్ ప్రారంభం నాటి నిల్వలు కూడా వాడుకొని 5.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించాం. కేంద్రం ఆగస్టు నెలకు రాష్ట్రానికి 1.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించి.. అందులో 1.31 లక్షల మెట్రిక్ టన్నులు దేశీయంగా, 0.39 లక్షల మెట్రిక్ టన్నులు దిగుమతి ద్వారా ఇవ్వాలని నిర్ణయించింది. ఇందులో దిగుమతి చేసుకోవాల్సిన యూరియాకు సంబంధించి షిప్‌మెంట్ వివరాలు ఇంకా రాలేదు. దేశీయ సంస్థలైన పీపీఎల్ నుంచి 11,000 మెట్రిక్ టన్నులు, ఎంసీఎఫ్ఎల్ నుంచి 7,000 మెట్రిక్ టన్నులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ.. ఆయా సంస్థలు సరఫరా చేయలేమని తెలియజేశాయి. ఏప్రిల్ నుంచి జులై వరకు రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో 2.10 లక్షల మెట్రిక్ టన్నుల కొరత ఏర్పడింది. ఈ విషయంలో కేంద్ర మంత్రి జేపీ నడ్డా తక్షణం చర్యలు తీసుకోవాలి. ఆ కొరతను ఆగస్టు నెల కోటాలో మంజూరు చేయాలి" అని మంత్రి తుమ్మల లేఖలో పేర్కొన్నారు.

## కేంద్ర ఎన్నికల సంఘం అధికారులతో భారత రాష్ట్ర సమితి నేతల భేటీ

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) అధికారులతో భారత రాష్ట్ర సమితి ప్రతినిధి బృందం భేటీ అయింది. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆధ్వర్యంలో నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎన్నికల సంస్కరణలపై ఇప్పటికే సమర్పించిన వివిధ అభ్యర్థనలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి సంబంధిత అంశాలపై ఈ భేటీలో భారత రాష్ట్ర సమితి నేతలు తమ అభిప్రాయాలను ఈసీఐకి తెలిపినట్లు సమాచారం. ఎన్నికల సంస్కరణలపై అన్ని రాజకీయ పార్టీల నుంచి ఈసీఐ అభిప్రాయాలను తీసుకుంటోంది. దీనిలో భాగంగా భారత రాష్ట్ర సమితి ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించింది.

## దిగజారి బతకలేను.. మళ్లీ త్యాగానికైనా సిద్ధం: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మునుగోడు: ఎల్బీనగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి వచ్చేదని.. కానీ, నియోజకవర్గ ప్రజల కోసమే మునుగోడు నుంచి పోటీ చేసినట్లు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. తనకు పదవి వస్తే అది ప్రజలకే ఉపయోగపడుతుందని.. అందరిలా పైరవీలు చేస్తూ దోచుకునేవాడిని కాదని వ్యాఖ్యానించారు. రాజగోపాల్‌రెడ్డి మంగళవారం మీడియాతో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి కావాలా? మునుగోడు ప్రజలు కావాలా? అంటే మునుగోడు ప్రజలే కావాలని కోరుకుంటానన్నారు. "పార్టీలో చేరినప్పుడు మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవులను అడ్డుపెట్టుకుని సంపాదించేవాడిని కాదు. నా స్వార్థం కోసం మంత్రి పదవిని అడగటం లేదు. మంత్రినైతే మంచి జరుగుతుందని మునుగోడు ప్రజలు భావిస్తున్నారు. భువనగిరి ఎంపీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తామన్నారు. పదవి ఇస్తారా? ఇవ్వరా? అనేది పార్టీ అధిష్ఠానం ఇష్టం. ఇతర పార్టీల నుంచి వచ్చిన వాళ్లకు, నా జూనియర్లకు కూడా ఇచ్చారు. ఎవరి కాళ్లో మొక్కి పదవి తెచ్చుకోవాలనుకోవట్లేదు. దిగజారి బతకడం నాకు తెలియదు. మళ్లీ త్యాగానికైనా సిద్ధం.. ఎంత దూరమైనా మునుగోడు ప్రజల కోసం వెళ్తా. నా నియోజకవర్గ ప్రజలు తలదించుకునే



పని ఏనాడూ చేయను" అని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు.

## అసెంబ్లీలో మైక్ కట్ చేయకుంటే..

### కాళేశ్వరంపై వాస్తవాలు బయటపెడతాం: కేటీఆర్

దిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక అంతా ట్రాష్ అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశం కోసం దిల్లీకి వెళ్లిన ఆయన.. అక్కడ మీడియాతో మాట్లాడారు. భారత రాష్ట్ర సమితి, మాజీ సీఎం కేసీఆర్‌ను దెబ్బతీయాలనే కుట్రలో భాగంగానే 650 పేజీల కాళేశ్వరం నివేదికను వారికి అనుకూలంగా కుదించారని కేటీఆర్ ఆరోపించారు. పూర్తి నివేదికను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మైక్ కట్ చేయకుండా మాట్లాడే అవకాశం ఇస్తే.. కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను బయటపెడతామన్నారు. బీసీ రిజర్వేషన్లపై



కాంగ్రెస్ పార్టీ దిల్లీలో నాటకాలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు.

## మాది మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వం

మేడ్చల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలంగాణ ఐటీ, పురపాలక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. మేడ్చల్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ఐదు మండలాల లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, కలెక్టర్ మనుచౌదరితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తమది మాటల ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని చెప్పారు. పేదవాడు ఆత్మగౌరవంతో బతికేలా రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం అందజేస్తున్నామన్నారు. మేడ్చల్



అసెంబ్లీ నియోజకవర్గంలో 40 వేల రేషన్ కార్డులు అందించామని.. మరో 60 వేల దరఖాస్తుల పరిశీలన పూర్తికాగానే అందజేస్తామన్నారు. భారత రాష్ట్ర సమితి హయాంలో 'మీ సేవ' కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగినా రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను నెరవేర్చడంలో సఫలీకృతమయ్యామని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. విద్యార్థుల కోసం స్కిల్ యూనివర్సిటీలు ఏర్పాటు చేసి వారికి సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వజ్రేష్ యాదవ్, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణలో స్థానికత వ్యవహారంపై సుప్రీంలో ముగిసిన విచారణ.. తీర్పు రిజర్వు

హైదరాబాద్: తెలంగాణ స్థానికత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పదో తరగతి తర్వాత రెండేళ్లు బయట ఉంటే స్థానికత వర్తించదన్న రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులపై పలువురు విద్యార్థులు హైకోర్టును ఆశ్రయించారు. విద్యార్థుల పిటిషన్‌పై విచారించి.. తగిన నిబంధనలు రూపొందించాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. స్థానికత అంటే ఏమిటి? ఎవరు దీని పరిధిలోకి వస్తారు? అందుకు ఉన్న పరిమితులపై మార్గదర్శకాలు జారీ చేయాలని హైకోర్టు తీర్పులో పేర్కొంది. దీంతో హైకోర్టు తీర్పును విద్యార్థులు సుప్రీంలో సవాల్ చేశారు. ఈ పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. రెండేళ్లు బయట ప్రాంతంలో చదువుకోవడానికి వెళితే తప్పేంటని విచారణ సందర్భంగా సీజేఐ ప్రశ్నించారు. పదేళ్లు స్థానికంగా ఉండి.. రెండేళ్లు బయటకు వెళితే స్థానికత ఎలా కోల్పోతారని ప్రశ్నించారు. 2014లో నిబంధనలు తీసుకొచ్చారు.. అప్పుడు ఈ రెండు, నాలుగేళ్ల సమయం గురించి అందులో ప్రస్తావించారా అని ధర్మాసనం ప్రశ్నించింది. 2024లో తీసుకొచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ ధర్మాసనం అభిప్రాయపడింది. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని వాదనల సందర్భంగా సీజేఐ అభిప్రాయం వ్యక్తం చేశారు. "కోటా, దుబాయ్ లాంటి ప్రాంతాలకు చదువుకోవడానికి వెళ్లిన విద్యార్థులకు స్థానికత వర్తించదంటే ఎలా? ఒక విద్యార్థి తెలంగాణలో పుట్టి పెరిగి.. రెండేళ్లు బయట చదువుకున్నంత మాత్రాన కోటా వర్తించదంటే ఎలా? ప్రతి విద్యార్థి 371డి అధికరణం గురించి తెలుసుకోవాలన్నట్టుగా మీ వాదనలు ఉన్నాయి. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులు ఉంటే.. 8వ తరగతిలోనే రాజ్యాంగం గురించి తెలుసుకోవాలన్న విధంగా మీ వాదనలు ఉన్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. పలు రాష్ట్రాల్లో స్థానికత వ్యవహారం పలు విధాలుగా ఉందన్న రాష్ట్ర



ప్రభుత్వం తరపు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ.. అస్సాంలో 7 సంవత్సరాల నిబంధన ఉందని గుర్తు చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో పేద, మధ్యతరగతి వాళ్లకు జరుగుతున్న ఉపయోగాన్ని విస్తృత కోణం నుంచి చూడాలని, అందుకు తగిన విధంగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. వాదనల అనంతరం తీర్పు రిజర్వు చేస్తున్నట్టు సీజేఐ జస్టిస్ గవాయ్ ధర్మాసనం తెలిపింది.

## ఎంపీ వేమిరెడ్డి కుమారుడినని చెప్పి మోసాలు.. కేటుగాడి అరెస్ట్



హైదరాబాద్: ఏపీలోని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుమారుడినని చెప్పి మోసాలకు పాల్పడుతున్న కేటుగాడిని కేపీహెచ్‌బీ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిని గుంటూరు జిల్లాకు చెందిన విక్రాంత్‌రెడ్డి అలియాస్ వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీలోని ఓ లేడీస్ హాస్టల్‌లో తన బంధువును విక్రాంత్ చేర్పించాడు. ఈ క్రమంలో హాస్టల్ యజమానిగా ఉన్న మహిళతో పరిచయం పెంచుకున్నాడు. తాను ఎంపీ కుమారుడినని.. జూబ్లీహిల్స్‌లో జ్యూయలరీ షాపు ఉందని నిందితుడు ఆమెను నమ్మించాడు. దీంతో రీమోడలింగ్ చేయించాలంటూ గొలుసును విక్రాంత్‌కు హాస్టల్ యజమాని ఇచ్చారు. దీనికి మరింత బంగారం అవసరమని చెప్పి నిందితుడు రూ.లక్ష తీసుకుని కనిపించకుండా పోయాడు. మోసపోయినట్లు గ్రహించిన హాస్టల్ యజమాని.. కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై గతంలో 14 కేసులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

# గ్యాస్ రాయితీ జమ కాకపోతే అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి: మంత్రి నాదెండ్ల

విశాఖపట్నం: పౌరసరఫరాల శాఖ ద్వారా ప్రజలకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నెలలో 15 రోజుల పాటు రేషన్ సరకులు అందజేస్తున్నామని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా 26 నుంచి 30 వరకు ఇంటివద్దే అందిస్తున్నామని వివరించారు. విశాఖపట్నం కలెక్టరేట్ లో నిర్వహించిన ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ సదస్సులో మంత్రి మాట్లాడారు. "ప్రజలకు మరింత మెరుగ్గా రేషన్ సరకులు అందజేసేందుకు సుమారు రూ.200 కోట్ల భారం పడినా ముందుకు వెళ్లాం. దీపం పథకం ద్వారా ఫేజ్ 1లో కోటి మందికి ఫేజ్ 2లో 95 లక్షల మందికి సబ్సిడీ అందించాం. ఫేజ్ 3లో సాంకేతిక సమస్యలను అధిగమించి అర్హులందరికీ పథక ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటాం. గ్యాస్ డెలివరీ బాయ్స్ ప్రజల నుంచి ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు మా దృష్టికి



వచ్చింది. దీనిపై ఇప్పటికే ఆయా అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశాం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలుంటాయి. లబ్ధిదారులకు గ్యాస్ రాయితీ జమ కాకపోతే అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి. కాలయాపన చేయకుండా సమస్యను పరిష్కరించాలి. ఆగస్ట్ 25 నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు అందజేస్తాం. రేషన్ బియ్యం అక్రమ తరలింపుపై నిఘా పెంచాం.. చట్టంలోనూ మార్పులు తీసుకొచ్చాం. లీగల్ మెట్రాలజీ శాఖ కార్యకలాపాలను పెంచాం. గత సీజన్‌లో రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం సేకరించి రూ.12వేల కోట్లు చెల్లించాం. ఏఐ సహాయంతో పౌర సరఫరాల శాఖలో డేటా అనాలసిస్ చేస్తున్నాం.. సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరిస్తున్నాం. ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో పనిచేయాలి" అని నాదెండ్ల మనోహర్ అన్నారు.

# ఎవరెన్ని కుట్రలు చేసినా... మూడేళ్లలో రాజధాని తొలిదశ నిర్మాణం పూర్తి చేస్తాం: నారాయణ

అమరావతి: అమరావతిలో పనులు జరగట్లేదని అసత్యప్రచారం చేసే వాళ్లు .. వచ్చి కళ్లతో చూడాలని పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ సూచించారు. రాజధాని అమరావతిలో వివిధ కాలువల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా ఇటీవల పనులకు ఆటంక మేర్పడిందని వెల్లడించారు. ఎవరెన్ని కుట్రలు పన్ని, ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా.. మూడేళ్లలో అమరావతి నిర్మాణం తొలిదశ పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. సింగపూర్‌లో ఉన్న అత్యున్నత నిర్మాణ ప్రమాణాలు ఇక్కడ అమలు చేస్తామని వెల్లడించారు. రివర్ ఫ్రంట్ సుందరీకరణపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కెనాల్ అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయని తెలిపారు.



రాజధాని రైతుల సమస్యలన్నీ దశల వారీగా పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

# మద్యం కుంభకోణంలో బయటపడింది కొంతే.. : మంత్రి అనగాని

అమరావతి: మద్యం కుంభకోణంలో వైకాపా నేతలు అడ్డంగా దొరికిపోయారని మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. ఆధారాలతో సహా నిందితులను సిట్ అరెస్టు చేసిందని చెప్పారు. "మద్యం కుంభకోణంలో డబ్బులు ఎలా చేతులు మారాయనేది ముఖ్యం. కానీ.. వైకాపా నేతలు ఏవేవో ఫొటోలు చూపించి తెదేపాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. రాజకీయ నాయకులు, సెలెబ్రిటీలతో చాలామంది ఫొటోలు దిగుతుంటారు. మద్యం దుకాణాల్లో డిజిటల్




చెల్లింపులు లేకుండా చేసి అక్రమాలకు పాల్పడ్డారు. ఇప్పుడు బయటపడింది కొంతే.. ఇంకా చాలా విషయాలు బయటకు వస్తాయి. కూటమి ప్రభుత్వ మద్యం విధానంపై జగన్ విమర్శలు అర్థ రహితం. వైకాపా మాదిరిగా నాసిరకం మద్యం మేము అమ్మడం లేదు. అమరావతిపై జగన్ మొదటి నుంచి విద్వేషంతోనే ఉన్నారు. ఇప్పుడు కూడా అదే విధంగా మాట్లాడుతున్నారు. గుంటూరు, విజయవాడ ప్రజలు త్వరలోనే జగన్‌కు తగిన బుద్ధి చెబుతారు" అని మంత్రి అన్నారు.

## ఆ సంగతి గుర్తుపెట్టుకోండి

# చంద్రబాబుకు షర్మిల కీలక సూచన...

విద్యుత్ సర్దుబాటు పేరుతో ప్రజల మీద కూటమి ప్రభుత్వం విధిస్తున్నది సర్దుపోటు అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ట్రూ అప్ చార్జీల వసూళ్లపై ఆమె స్పందించారు. విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదంటూనే జనాలకు సీఎం చంద్రబాబు పెడుతున్నవి షాకుల మీద షాకులు అని ఆమె ఎద్దేవా అన్నారు. అవి ట్రూ అప్ ఛార్జీలు కాదు..సామాన్యుడిని నడ్డి విరిచే ఛార్జీలు అని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజానీకాన్ని పీల్చి పిప్పి చేసే ఛార్జీలు అని చెప్పారు. జనం నెత్తిన పెడుతున్నది గుదిబండ అని విమర్శించారు. ఇప్పటికే రూ.17 వేల కోట్ల భారాన్ని మోపారని, ఇది చాలదన్నట్లు మరో రూ.12 వేల కోట్ల మేర అధిక భారాన్ని మోపాలని చూడటం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రూ అప్ చార్జీల వసూళ్లపై విద్యుత్ నియంత్రణ మండలి ప్రజా అభిప్రాయం సేకరిస్తుంటే కూటమి ప్రభుత్వం మౌనం వహించడం సిగ్గుచేటన్నారు. కరెంటు ఛార్జీల వీర బాదుడులో వైఎస్ జగన్ కి చంద్రబాబు వారసుడు అని షర్మిల విమర్శించారు. "కూటమిని గెలిపిస్తే ఒక్క రూపాయి పెంపు ఉండదన్నారు. అవసరమైతే ఛార్జీల్లో 30 శాతం తగ్గిస్తామని గొప్పలు చెప్పారు. తీరా పవర్ దక్కాక 14 నెలల్లోనే రూ.30 వేల కోట్ల సర్దుబాటు భారాన్ని జనం నెత్తిన పెడుతున్నారు. హామీలను మరిచి ఓటేసిన పాపానికి పేదోడి ఇళ్లను గుళ్ళ చేస్తున్నారు. ట్రూ అప్ తప్పు మీది కాదు సరే.. అలాగని గత వైసీపీ తప్పిదాలను ప్రజల నెత్తిన రుద్దుతారా?. YCP పెట్టిన భారాన్ని జనాల దగ్గర ముక్కు పిండి వసూలు చేస్తారా?. గత పాలకుల తప్పులను సరిదిద్దడం అంటే జనాలను బాదడమా ?. ఏనాడో వాడిన కరెంటుకు ఇప్పుడు అదనపు ఛార్జీలు వేయడం ఏంటి?. ట్రూ అప్ పేరుతో ఎన్నాళ్లు ఈ దోపిడి ? విద్యుత్ ఛార్జీల విషయంలో ప్రజలకు చంద్రబాబు చేసింది నమ్మక ద్రోహం."



అని షర్మిల వ్యాఖ్యానించారు. "రూ.12 వేల కోట్ల సర్దుబాటు భారాన్ని ప్రజలపై పడకుండా చూడండి. ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలి. వెంటనే చంద్రబాబు గారు APERC కి లేఖ రాయాలి. గతంలో విధించిన రూ.17 వేల కోట్ల భారాన్ని సైతం వెనక్కి తీసుకోవాలి. గత ప్రభుత్వం తప్పు చేసినా.. ప్రజా కోర్టులో పడే శిక్ష మీకే అన్న సంగతి చంద్రబాబు గారు గుర్తు పెట్టుకోవాలి." అని వైఎస్ షర్మిల సూచించారు.

# బైకును ఢీకొట్టిన అంబులెన్స్.. ఇద్దరు మృతి




ఉంగుటూరు: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందారు. కైకరానికి చెందిన గున్ను శ్రీరామమూర్తి (70) తన పొలంలో కలుపు తీసేందుకు అదే గ్రామానికి చెందిన కూలి పెండ్ర చిరంజీవి (40)తో ద్విచక్ర వాహనంపై స్థానిక పొలానికి బయలుదేరారు. హైదరాబాద్ నుంచి తణుకు వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీరామమూర్తి, చిరంజీవి అక్కడికక్కడే మృతి చెందారు.

# గుంటూరు జీజీహెచ్‌లో అరుదైన శస్త్రచికిత్స

గుంటూరు: గుంటూరు జీజీహెచ్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ముఖంపై కణితితో బాధపడుతున్న ఓ వ్యక్తికి శస్త్రచికిత్స చేసి దాన్ని తొలగించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్వీ రమణ మీడియాతో మాట్లాడుతూ.. "ప్రత్తిపాడుకు చెందిన అశోక్ చాలాకాలంగా ముఖంపై కణితితో బాధపడుతున్నారు. ఇటీవల జీజీహెచ్‌కు రాగా.. పరీక్షలు నిర్వహించి పారోటిడ్ కార్సినోమా ఉన్నట్లు గుర్తించాం. అది క్యాన్సర్‌గా మారే ప్రమాదం ఉండటంతో వెంటనే సర్జరీ చేయాలని నిర్ణయించాం. ప్రొఫెసర్ కిరణ్



కుమార్ బృందం విజయవంతంగా ఆ సర్జరీని పూర్తి చేసింది. రూ.4లక్షల వరకు ఖర్చయ్యే సర్జరీని ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచితంగా చేశాం" అని చెప్పారు. కణితితో ఎంతో ఇబ్బంది పడుతున్న అశోక్‌కు ధైర్యం చెప్పి సర్జరీ చేసినట్లు ప్రొఫెసర్ కిరణ్‌కుమార్ తెలిపారు. తమ వైద్యుల బృందం నాలుగు గంటలు శ్రమించి సర్జరీని పూర్తి చేసినట్లు చెప్పారు. పేషెంట్ కి పూర్తిగా మత్తుమందు ఇచ్చి, ముఖ కండరాలు దెబ్బతినకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకొని సర్జరీ చేశామన్నారు. వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది సహకారంతో సర్జరీ విజయవంతమైందని తెలిపారు.

# రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు.. సీఎంకు ఆహ్వానం

మంత్రాలయం: కర్నూలు జిల్లా మంత్రాలయంలో ఈనెల 8 నుంచి 14 వరకు రాఘవేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా శ్రీ మఠం అధికారులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబును ఈ ఉత్సవాలకు ఆహ్వానించారు. మంగళవారం తెల్లవారుజామున సీఎం నివాసంలో రాఘ వేంద్ర స్వామి మఠం సహాయ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, సూపరింటెండెంట్ అనంతపురాణిక్‌లు చంద్రబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ఆహ్వాన పత్రికను అందజేశారు. రాఘవేంద్ర స్వామి జ్ఞాపక ఫలమంత్ర అక్షింతలు అందజేశారు. అనంతరం మంత్రి పయ్యావుల కేశవ్, రాయ దుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసు, లకు కూడా జ్ఞాపిక



ఇచ్చి రాఘ వేంద్ర స్వామి సప్తరాత్రోత్సవాలకు ఆహ్వానించారు.

# 'రైతులకు ఎరువుల కొరత అంటూ వైసీపీ ప్రచారం'.. మంత్రి ఫైర్

రాష్ట్రంలో ఎరువుల కొరత ఎక్కడా లేదు. సీజన్ కు సరిపడా నిరంతరం ఎరువుల సరఫరా కొనసాగుతుంది అని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. రైతులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా ప్రైవేట్ కంపెనీలలో, సహకార సంస్థలలో ఎరువులు సరఫరా అయ్యేలా ప్రణాళికలు రూపొం దించామన్నారు. ఖరీఫ్ సీజన్ కు 16.76 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించినట్లు తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీ, రైతు సేవా కేంద్రాలు, మార్క్ ఫెడ్ గోదాములు, రిటైల్/హోల్ సెల్ కంపెనీ గోదాముల ద్వారా రైతులకు అందజేస్తున్నామని మంత్రి వివరించారు. రైతులకు ఎరువుల కొరత అంటూ వైసీపీ నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రైతు ప్రయోజనాలే ముఖ్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఎరువుల నిల్వలు, వినియోగంపై సచివాలయంలో ఈ మధ్యాహ్నం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడనున్నట్లు మంత్రి తెలిపారు.



# పార్టీకి పెద్దన్న పాత్ర పోషిస్తున్నది న్యాయవాదులే: జగన్



ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక పరిస్థితుల్లో న్యాయవాదులే పార్టీకి పెద్దన్న పాత్ర పోషిస్తున్నారని మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. న్యాయవాదులు పిటిషన్ వేయకపోతే న్యాయస్థానంలో న్యాయం కూడా దక్కదని చెప్పారు. కలియుగం అంటే చంద్రబాబు 14 నెలల పాలన చూస్తే అర్థం అవుతుందని అన్నారు. న్యాయం, ధర్మం ఏమీ లేవని మండిపడ్డారు. గిట్టని వాళ్లు, వ్యతిరేకంగా స్వరం వినిపించేవాళ్లు ఉంటే ఈ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోతోందని అన్నారు. ఎలాగైనా చిత్రహింసలు పెట్టి జైలులో వేయాలనే నీచమైన సంస్కృతి రాష్ట్రంలో ఉందన్నారు. ఒక మనిషిని జైలులో పెట్టడం అంటే అతడి పరువు, ప్రతిష్టతలతో ఆడుకోవడమే అని వ్యాఖ్యానించారు. ఏ తప్పూ చేయనివారిపై బురద వేసి దొంగ సాక్ష్యాలను సృష్టించి సైతం ప్రలోభపెడుతున్నారని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు న్యాయవాదులు చేస్తున్న సాయం ఎప్పటికీ పార్టీ మర్చిపోదు అని చెప్పారు. ఇది వరకు ఎప్పుడూ జరగని విధంగా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు న్యాయవాదులకు మంచి చేశామని అన్నారు.

# వివేకా హత్య కేసు ఇన్వెస్టిగేషన్ కంప్లీట్.. సుప్రీంకు విన్నవించిన సీబీఐ

మాజీమంత్రి వివేకానంద రెడ్డి హత్యకేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ మేరకు కేసులో ఇన్వెస్టిగేషన్ పూర్తి అయిందని సీబీఐ తరపు న్యాయవాది దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు కు తెలిపారు. అందుకు సంబంధించి పూర్తి నివేదికను కూడా కోర్టుకు సమర్పించారు. ఒకవేళ సుప్రీం కోర్టు ఆదేశిస్తే తదుపరి విచారణను కూడా కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ అంశంపై మరికొద్దిసేపట్లో జస్టిస్ సుందరేశ్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇటీవలే మాజీ మంత్రి వివేకానంద రెడ్డి హత్య కేసులో మూడు అంశాలపై సీబీఐ అభిప్రాయం తెలపాలని సుప్రీం కోర్టు ధర్మాసనం కోరిన విషయం తెలిసిందే. వారి ఒపీనియన్ చెప్పిన తరువాతే వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి బెయిల్ రద్దుపై విచారణ చేపడతామని ధర్మాసనం స్పష్టం చేసింది. కేసులో ఇంకా తదుపరి దర్యాప్తు



అవసరమని సీబీఐ భావిస్తుందా..లేదో చెబితేనే కేసు కొలిక్కి రానుంది. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం కడప సెషన్స్ కోర్టులో దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టుపై కూడా సీబీఐ ఒపీనియన్ చెప్పాల్సి ఉంది. ఇక కేసు ట్రయల్, తదుపరి దర్యాప్తు ఏకకాలంలో కొనసాగించే అవకాశం ఉందా.. లేదా అనే అంశంపై సీబీఐ క్లారిటీ ఇవ్వాల్సి ఉంది. కాగా, వివేకా హత్య కేసులో వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు పలువురు నిందితులకు తెలంగాణ హైకోర్టు గతంలో బెయిల్ మంజూరు చేసింది. అయితే, హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ.. వివేకా కుమార్తె సునీతా రెడ్డి , సీబీఐ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్లను ఇప్పటికే పలుమార్లు జస్టిస్ ఎంఎం సుందరేష్ ధర్మాసనం విచారించింది. వాదనల సందర్భంగా వైఎస్ అవినాష్ రెడ్డితో పాటు బెయిల్‌పై ఉన్న మిగతా నిందితులంతా సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీతా రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తన వాదనలు వినిపించారు. CBI అధికారి రామ్‌సింగ్‌తో పాటు సునీతా రెడ్డి దంపతులపై దాఖలైన కేసులో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన క్లోజర్ రిపోర్టును పరిగణనలోకి తీసుకుని అవినాష్ రెడ్డి బెయిల్ రద్దు చేయాలని సిద్ధార్థ్ లూథ్రా ధర్మాసనానికి విన్నవించారు. ఈ క్రమంలోనే అవినాశ్ రెడ్డి బెయిల్ రద్దుపై సుప్రీం కోర్టు ఎలాంటి తీర్పు ఇస్తుందోనని వైసీపీ శ్రేణుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..

### 308 పాయింట్లు పతనమైన సెన్సెక్స్..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 81వేల పాయింట్లకు దిగువకు పడిపోయింది. ఆటో మినహా చాలారంగాల్లో అమ్మకాలు కనిపించాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 80,946.43 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,010.49 గరిష్టాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,554.40 పాయింట్లకు పడిపోయింది. చివరకు 308.47 పాయింట్లు తగ్గి 80,710.25 వద్ద ముగిసింది. నిఫ్టీ 73.20 పాయింట్లు పతనమై.. 24,649.55 వద్ద స్థిరపడింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వరుస ప్రకటనల నేపథ్యంలో సూచీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అయితే, ఆటో స్టాక్స్ మాత్రం కొంత వరకు నష్టాల నుంచి గట్టెక్కించాయి. ఆటో ఇండెక్స్ 0.4 శాతం పెరగ్గా.. బ్యాంక్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, ఫార్మా ఒక్కొక్కటి 0.5 శాతం తగ్గాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు స్వల్ప నష్టాలతో ముగిశాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్ అత్యధికంగా నష్టపోయాయి. టైటాన్ కంపెనీ, మారుతి సుజుకి, ఎస్‌బీఐ లైఫ్, ట్రెంట్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ లాభపడ్డాయి. రాజీవ్ ఆనంద్‌ను కొత్త సీఈవోగా నియమించడానికి ఆర్‌బీఐ ఆమోదం పొందడంతో ఇండస్‌ఇండ్ బ్యాంక్ షేర్లు పెరిగాయి. పేటీఎం షేర్లు 2శాతం క్షీణించాయి.

## విండోస్ 10 యూజర్లకు మైక్రోసాఫ్ట్ గుడ్‌న్యూస్..




**న్యూఢిల్లీ:** ఆపరేటింగ్ సిస్టమ్ వాడుతున్న యూజర్లకు అలెర్ట్. ఈ ఏడాది అక్టోబర్ 14 తర్వాత నుంచి మైక్రోసాఫ్ట్ అప్‌డేట్స్, సెక్యూరిటీ ప్యాచ్‌లను నిలిపివేయనున్నట్లు ప్రకటించింది. ఇకపై ఈ ఆపరేటింగ్ సిస్టమ్‌కు సంబంధించి అన్ని సేవలు నిలిచిపోనున్నాయి. అయితే, ఇప్పటికప్పుడు యూజర్లు అందరూ భయపడాల్సిన అవసరమేమీ లేదు. సాధారణ ట్రిక్‌తో సంవత్సరం పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందే అవకాశం ఉన్నది. మైక్రోసాఫ్ట్ విండోస్ 10 యూజర్ల కోసం ఎక్స్‌టెండెడ్ సెక్యూరిటీ అప్‌డేట్స్ పేరుతో ప్రోగ్రామ్‌ను ప్రారంభించింది.

ఇప్పటికప్పుడు విండోస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్‌కి మారకుండా, హార్డ్‌వేర్ సపోర్ట్ చేయని యూజర్లను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రోగ్రామ్‌ను తీసుకు వచ్చింది. వినియోగదారులు ఇందులో వినియోగదారులు సెక్యూరిటీ అప్‌డేట్స్‌ను పొందుతారు. అయితే, కొత్త ఫీచర్లు, టెక్ సపోర్ట్ మాత్రం ఉండదు. అయితే, ఈ సేవలను పొందేందుకు యూజర్లు 30 డాలర్లు (రూ.2500) ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. పీసీ బ్యాకప్ చేసి ఉంటే.. మైక్రోసాఫ్ట్ రివార్డ్ పాయింట్లు ఉంటే ఈ సేవలను మాత్రం ఉచితంగా పొందే అవకాశం ఉంది. ప్రస్తుతం మీరు వాడుతున్న విండోస్ 10 సిస్టమ్ వాడుతున్న అందరికీ మైక్రోసాఫ్ట్ ఉచితంగానే విండోస్ 11 ఉచితంగా ఇన్‌స్టాల్ చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నది. 10 ఓఎస్‌ను కొనసాగించాలనుకునే వారికి ఈఎస్‌యూ తీసుకోవచ్చని టెక్ నిపుణులు పేర్కొంటున్నారు.

## ఫైలింగ్ తర్వాత 30 రోజుల్లో వెరిఫై చేయకపోతే మీ ఐటీ రిటర్న్ చెల్లదు..!




**న్యూఢిల్లీ:** మీరు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేశారా..? అయితే అంతటితో మీ పని పూర్తి కాలేదు. ఆన్‌లైన్‌లో రిటర్న్‌లు అప్‌లోడ్ చేసిన తర్వాత 30 రోజుల్లోగా వాటిని తప్పనిసరిగా వెరిఫై చేయాల్సి ఉంటుందని, లేదంటే ఆదాయపు పన్ను శాఖ మీరు దాఖలు చేసిన ఆ రిటర్న్‌ను చెల్లనివిగా పరిగణిస్తుందని ఎక్స్‌పర్ట్స్ హెచ్చరిస్తున్నారు.

కేవలం ఈ-ఫైలింగ్ వెబ్‌సైట్‌లో వివరాలు సమర్పించినంత మాత్రాన ప్రక్రియ ముగిసినట్లు కాదని నిపుణులు చెబుతున్నారు. 2025-26 అసెస్‌మెంట్ ఇయర్‌కు సంబంధించి ఐటీఆర్ ఫైల్ చేసేందుకు పొడిగించిన గడువు సెప్టెంబర్ 15 తో ముగియనుంది. ఇప్పటికే చాలామంది పన్ను చెల్లింపుదారులు ఈ ప్రక్రియను పూర్తి చేశారు. అయితే ఫైలింగ్ తర్వాత అత్యంత కీలకమైన వెరిఫికేషన్ దశను నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

గడువులోగా వెరిఫై చేయని రిటర్న్‌లను ఆదాయపన్ను శాఖ ప్రాసెస్ చేయదు. పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్‌లను రెండు పద్ధతుల్లో వెరిఫై చేయవచ్చు. అందులో మొదటిది సులభమైన ఈ-వెరిఫికేషన్ పద్ధతి. రెండోది ఆఫ్‌లైన్ పద్ధతి. ఆన్‌లైన్‌లో అయితే ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా క్షణాల్లో వెరిఫికేషన్ పూర్తి చేయవచ్చు. ఇది చాలా సులభమైన, వేగవంతమైన పద్ధతి. ఇందుకు ఈ-ఫైలింగ్ పోర్టల్‌లోకి లాగిన్ అయి, 'ఈ-వెరిఫై రిటర్న్' ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ 'ఆధార్ ఓటీపీ'ని సెలెక్ట్ చేసుకుని, మొబైల్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేస్తే సరిపోతుంది.

నెట్ బ్యాంకింగ్, డీమ్యాట్ ఖాతా, ఏటీఎంల ద్వారా ఎలక్ట్రానిక్ వెరిఫికేషన్ కోడ్ జనరేట్ చేసి కూడా ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ ఉన్నవారు దాని ద్వారా కూడా వెరిఫై చేసుకోవచ్చు. ఒకవేళ ఆఫ్‌లైన్ పద్ధతిని ఎంచుకుంటే, ఐటీఆర్-వి అకనాలెడ్జ్‌మెంట్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, దానిపై సంతకం చేసి, ఫైల్ చేసిన 30 రోజుల్లోగా బెంగళూరులోని సెంట్రల్ ప్రాసెసింగ్ సెంటర్‌కు పోస్టులో పంపాలి. అయితే ఈ ప్రక్రియకు ఎక్కువ సమయం పడుతుంది.

ఏదైనా కారణంవల్ల 30 రోజుల గడువులోగా మీరు ఐటీఆర్ వెరిఫికేషన్ పూర్తి చేయలేకపోతే, ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఈ-ఫైలింగ్ పోర్టల్‌లోనే 'కండోనేషన్ ఆఫ్ డిలే' అని అభ్యర్థన పెట్టుకోవచ్చు. ఆలస్యానికి గల కారణాలను వివరిస్తూ అభ్యర్థన సమర్పిస్తే ఆదాయపు పన్ను శాఖ దాన్ని ఆమోదించే అవకాశం ఉంటుంది. ఐటీ శాఖ ఆమోదం తెలిపితే మీ రిటర్న్ వెరిఫై అయినట్లుగా పరిగణిస్తారు.




# ఇంగ్లండ్‌తో సిరీస్ డ్రా

### డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో మూడోస్థానానికి టీమిండియా..!

**న్యూఢిల్లీ:** యువ కెప్టెన్ శుభమన్ గిల్ నేతృత్వంలోని టీమిండియా ఇంగ్లండ్‌తో జరిగిన ఐదో టెస్టును ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేసింది. 2025-27 ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ కొత్త సైకిల్ టీమిండియాకు ఇదే తొలిసిరీస్. రెడ్ బాల్ ఫార్మాట్‌లో భారత జట్టుకు గిల్ నాయకత్వంలో మొదటిసారి టీమిండియా ఇంగ్లండ్‌లో పర్యటించింది. ఈ సిరీస్‌ను గెలుచుకోలేకపోయినా.. చివరిదైన ఓవల్ టెస్టులో ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో విజేతగా నిలిచింది. ఈ విజయం చాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో టీమిండియా మూడోస్థానానికి చేరుకున్నది. ఓవల్ టెస్ట్‌కు ముందు పాయింట్ల పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా.. ఇప్పుడా స్థానంలో ఇంగ్లండ్ ఉన్నది. భారత్ ఐదు మ్యాచుల్లో రెండు విజయాలు, రెండు ఓటములు, ఒక డ్రాతో 28 పాయింట్లతో పాటు 46.67శాతం పర్సంటేజ్ ఉన్నది. ఇక ఆస్ట్రేలియా జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్నది. ఆస్ట్రేలియా మూడు మ్యాచుల్లో మూడు విజయాలను నమోదు చేసింది. శ్రీలంక జట్టు రెండోస్థానంలో ఉన్నది. రెండు మ్యాచులు ఆడగా.. అందులో ఒకటి గెలువగా.. మరొకటి డ్రాగా ముగిసింది. ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచుల్లో రెండింట్లో గెలిచి.. రెండింట్లో ఓడిపోగా.. మరో మ్యాచ్‌ను డ్రా చేసుకున్నది.

#### ఐదు టెస్టులో ఉత్కంఠ విజయం..

ఇంగ్లండ్‌తో ఓవల్ వేదికగా జరిగిన చివరి టెస్టులో భారత జట్టు ఆరు పరుగుల తేడాతో గెలిచింది. ఆతిథ్య జట్టుకు భారత్ 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 367 పరుగులకే కుప్పకూలింది. ఐదోరోజు ఇంగ్లండ్ గెలిచేందుకు 35 పరుగులు, భారత జట్టుకు నాలుగు వికెట్లు అవసరం. సిరాజ్ మూడు వికెట్లు తీయగా.. ప్రసిద్ధ్ కృష్ణ ఒక వికెట్ పడగొట్టాడు. రెండో ఇన్నింగ్‌లో సిరాజ్ ఐదు వికెట్లు తీయగా.. ప్రసిద్ధ్ కృష్ణకు నాలుగు వికెట్లు దక్కాయి. ఆకాశ్ దీప్ ఒక వికెట్ పడగొట్టాడు. ఐదు టెస్టుల సిరీస్‌ను భారత్ 2-2తో డ్రాగా ముగిసింది. శుభ్‌మాన్ గిల్ నేతృత్వంలోని యువ జట్టు చేసిన అద్భుత ప్రదర్శన చేసింది. వాస్తవానికి ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ ఫేవరెట్‌గా పలువురు మాజీలు పేర్కొన్నారు. విమర్శకులందరి నోళ్లను టీమిండియా తన ఆటతీరుతో మూయించింది భారతదేశం తొలి ఇన్నింగ్స్‌లో 224 పరుగులు చేసింది. ఆ తర్వాత ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఇంగ్లిష్ జట్టుకు 23 పరుగుల ఆధిక్యం దక్కింది. రెండో ఇన్నింగ్స్‌లో టీమిండియా 396 పరుగుల చేసి.. ఆతిథ్య జట్టుకు 374 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స 367 పరుగుల వద్ద ముగిసింది. జో రూట్ (105), హ్యారీ బ్రూక్ (111) పరుగులు చేసినా ఇంగ్లండ్‌ను ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయారు.

### అతను లేకపోవడం వల్లే ఓవల్ టెస్టులో
## భారత్‌పై ఇంగ్లండ్ ఓడిపోయింది

#### మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్



**ఓవల్:** రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ అందుబాటులో లేకపోవడం వల్లే భారత్‌తో ఓవల్ టెస్టులో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు ఓడిపోయిందని మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ అభిప్రాయపడ్డాడు. ఆఖరి టెస్టు చివరి రోజున ఇంగ్లండ్ జట్టు తొందరపాటును ప్రదర్శించిందని పేర్కొన్నాడు. మ్యాచ్‌ను గెలిచేందుకు కేవలం 35 పరుగులు మాత్రమే అవసరమని.. చేతిలో ఇంకా నాలుగు వికెట్లు మిగిలే ఉన్నాయని మాజీ కెప్టెన్ తెలిపాడు. భారత్ అద్భుతంగా రాణించి ఆరు పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-2 తేడాతో సమం చేసిందని చెప్పాడు. బెన్ స్టోక్స్ జట్టులో ఉండి ఉంటే.. ఇంగ్లండ్ ఈ టెస్టులో గెలిచి ఉండేదని.. ఆల్‌రౌండర్ జట్టులో కీలకపాత్ర పోషిస్తున్నాడని చెప్పాడు. జట్టును మానసికంగా బలంగా ఉండేలా చూస్తాడని చెప్పాడు.

ఐదోరోజు ఉదయం తొందరపాటును ప్రదర్శించిందని.. జట్టు గెలిచేందుకు మంచి భాగస్వామ్యాలను అవసరమని.. దూకుడుగా ఆదే విధానంలో తొందరపాటును ప్రదర్శిస్తారని పేర్కొన్నాడు. హ్యారీ బ్రూక్ అవుట్ కావడంతోనే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కుప్పకూలడం మొదలైందని తెలిపాడు. రెగ్యులర్ కెప్టెన్ బెన్ స్టోక్స్ భుజం గాయం కారణంగా చివరి టెస్టుకు దూరమైన విషయం తెలిసిందే. ఫాస్ట్ బౌలర్లు జోఫ్రా ఆర్చర్, బ్రైడాన్ కార్స్‌కు విశ్రాంతి ఇచ్చిన విషయం తెలిసిందే.

ఈ ఏడాది నవంబర్‌లో ఆస్ట్రేలియా వేదికగా జరిగే యాషెస్ సిరీస్‌కు భారత్‌తో జరిగే ఉత్కంఠభరితమైన సిరీస్ ఇంగ్లండ్‌కు మంచి సన్నాహకమని వాన్ తెలిపాడు. ఇంగ్లండ్ ఐదు గొప్ప మ్యాచులను ఆడిందని చెప్పాడు. ఓవల్ టెస్టులో ఇంగ్లండ్‌కు కేవలం పదిమంది ఆటగాళ్లు మాత్రమే ఉన్నారని.. ఓ బౌలర్ ముందుగానే మ్యాచ్‌కు దూరమయ్యాడని, బెన్ స్టోక్స్ కూడా అందుబాటులో లేకుండా పోయాడని చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఆటగాళ్లు అందరూ సంసిద్ధంగా ఉన్నారని తాను భావిస్తున్నానని.. ఆసిస్ పర్యటనకు ముందు బౌలింగ్ లైనప్‌ను సరిదిద్దుకోవాలని.. బెన్ స్టోక్స్ ఫిట్‌గా ఉండాలని.. అతను ఉంటే ఇంగ్లండ్ ఓ జట్టునైనా ఓడించగలదని.. లేకపోతే ఎవరైనా జట్టును ఓడించవచ్చని మాజీ కెప్టెన్ వ్యాఖ్యానించాడు.

## ఐదు టెస్టులు.. 6,736 పరుగులు..

#### నేలపాలైన 41 క్యాచ్‌లు..!



**న్యూఢిల్లీ:** భారత్, ఇంగ్లండ్ దిగ్గజాల పేరుతో నిర్వహించిన అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో ఎన్నో రికార్డులు బద్ధలయ్యాయి. 25 రోజుల సుదీర్ఘ సమయంలో ఇరుజట్ల ఆటగాళ్లు శతకాలతో రెచ్చిపోగా.. బౌలర్లు వికెట్ల పండుగ చేసుకున్నారు. మొదటిదైన లీడ్స్ టెస్టులో ఇంగ్లండ్ అద్భుత విజయం నుంచి.. ఓవల్ మైదానంలో టీమిండియా థ్రిల్లింగ్ విక్టరీ వరకూ ఎన్నో రికార్డులు నమోదయ్యాయి.

భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, రిషభ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలతో చరిత్ర సృష్టించగా.. జో రూట్ ఒకే ఒక ఇన్నింగ్స్‌తో ముగ్గురు దిగ్గజాల(రాహుల్ ద్రవిడ్, జాక్వెస్ కలిస్, రికీ పాంటింగ్)ను దాటేశాడు. ఇక బౌలర్లు అయితే రికార్డు స్థాయిలో 1,860.4 ఓవర్లు వేశారు. మొత్తంగా రెండు జట్ల బ్యాటర్లు 6,736 పరుగులు బాదగా.. ఫీల్డర్లు అత్యధికంగా 41 క్యాచ్‌లను జారవిడిచారు.

విదేశాల్లో చరిత్రాత్మక విజయాలు సాధిస్తున్న భారత జట్టు ఈసారి ఇంగ్లండ్ గడ్డ మీద పంజా విసిరింది. సీనియర్లు అశ్విన్, రోహిత్, కోహ్లీలు వీడ్కోలుతో దూరమైనా.. బుమ్రా అన్ని మ్యాచ్‌లు ఆడకున్నా సమిష్టి పోరుతో నవ చరిత్ర లిఖించింది. తొలి సిరీస్‌లోనే కెప్టెన్‌గా, బ్యాటర్‌గా తనదైన ముద్రవేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు అందుకున్నాడు గిల్. అయితే.. టీమిండియా స్వల్ప పరుగుల (ఓవల్ టెస్టులో 6 పరుగుల విజయం) తేడాతో గెలుపొందడం ఇదే మొదటిసారి. 2004లో ఆస్ట్రేలియాపై వాంఖడేలో భారత్ 13 పరుగుల తేడాతో గెలిచింది.

ఈ సిరీస్‌లో ఆల్‌టైమ్ రికార్డు అంటే సిరాజ్‌దే. ప్రధాన పేసర్ బుమ్రా గైర్హాజరీలో బౌలింగ్ యూనిట్‌కు దళపతిగా వ్యవహరించిన మియా భాయ్ అత్యధిక వికెట్ల(23) వీరుడిగా నిలిచాడు. అలుపన్నదే తెలియదన్నట్టు ఐదు టెస్టులు ఆడిన సిరాజ్185.5 ఓవర్లు (1,113 బంతులు) బౌలింగ్ చేశాడు. ఓవల్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ప్రదర్శనతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడీ హైదరాబాదీ. ఈ సిరీస్‌లో వెయ్యి బంతులు సంధించిన ఇంగ్లండ్ పేసర్ క్రిస్ వోక్స్ రెండో స్థానంలో ఉన్నాడు.

#### అంపైర్లదే విజయం

ఐదు టెస్టుల సిరీస్‌లో ఆటగాళ్ల మాదిరిగానే అంపైర్లు కచ్చితమైన నిర్ణయాలతో ఆకట్టుకున్నారు. మొత్తంగా ఇరుజట్లు అంపైర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 63 రివ్యూలు తీసుకున్నాయి. వీటిలో 44 వృథా అయ్యాయంటే ఫీల్డ్ అంపైర్లు ఎంత పక్కాగా ఉన్నారో అర్థమవుతుంది. ఇందులో భారత జట్టు తీసుకున్న 24 రివ్యూస్ అనుకున్న ఫలితాన్ని ఇవ్వలేదు.

# ఆసియా కప్‌పై గురి..

#### బంగ్లాదేశ్ తాత్కాలిక బృందంలో 25 మంది..!

**ఢాకా:** బంగ్లాదేశ్ జట్టు ఆసియా కప్ కోసం సన్నాహకాలు షురూ చేసింది. మెగా టోర్నీకి ముందు స్వదేశంలో నెదర్లాండ్స్‌తో మూడు టీ20ల సిరీస్ ఆడనుంది బంగ్లా. దాంతో, ఈ సిరీస్‌తో పాటు ఆసియా కప్‌ను దృష్టిలో ఉంచుకొని మంగళవారం సెలెక్టర్లు ప్రిలిమినరీ స్క్వాడ్‌ను ఎంపిక చేశారు. లిటన్ దాస్ సారథిగా 25 మందితో కూడిన బృందాన్ని ప్రకటించారు. వికెట్ కీపర్ నురుల్, మాజీ కెప్టెన్ శాంటోలకు చోటు దక్కింది.

డచ్ జట్టుపై సిరీస్ విజయంతో ఆసియా కప్ పోటీలకు ఆత్మ విశ్వాసంతో వెళ్లాలనుకుంటోంది బంగ్లాదేశ్. ఈ సిరీస్ ముగియడమే ఆలస్యం.. సెప్టెంబర్ 9 నుంచి 28 వరకూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వేదికగా ఆసియా కప్ మొదలవ్వనుంది. 'అందుబాటులో ఉన్న క్రికెటర్లు ఆగస్టు 6లోపు మిర్పూర్‌లోని ఫిట్‌నెస్ క్యాంప్‌లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఆగస్టు 15 నుంచి నైపుణ్య శిక్షణ కొనసాగనుంది.

ఆగస్టు 20 నాటికి క్యాంప్ సిల్హెట్‌కు తరలిపోనుంది' అని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. మూడు టీ20ల సిరీస్ కోసం నెదర్లాండ్స్ జట్టు ఆగస్టు 26న బంగ్లాకు రానుంది. ఆగస్టు 30న మొదటి మ్యాచ్, సెప్టెంబర్ 1న రెండో టీ20, సెప్టెంబర్ 3న మూడో మ్యాచ్ జరుగనున్నాయి.



ఆసియా కప్ తాత్కాలిక స్క్వాడ్ : లిటన్ దాస్(కెప్టెన్), తంజిద్ హసన్, నయీం షేక్, సౌమ్యా సర్కార్, మహ్మద్ పర్వేజ్ హొసేన్, తౌహిద్ హృదొయ్, జకీర్ అలీ అనిక్, మెహిదీ హసన్ మిరాజ్, షమీమ్ హొసేన్, నజ్ముల్ హుసేన్ శాంటో, రిషద్ హొసేన్, షక్ మహెదీ హసన్, తన్వీర్ ఇస్లాం, నసుం అహ్మద్, హసన్ మహ్మద్, తస్కిన్ అహ్మద్, తంజిమ్ హసన్ షకీబ్, సైఫుద్దీన్, నహిద్ రానా, ముస్తాఫిజుర్, షోరిఫుల్ ఇస్లాం, సయ్యద్ ఖలీద్ అహ్మద్, ఖాజీ నురుల్ హసన్, మహిదుల్ ఇస్లాం, మహ్మద్ సైఫ్ హసన్.

## సినీ ఇండస్ట్రీ అంశాలన్నీ
# దిల్ రాజుకు అప్పగించాం
### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి





**టాకీస్:** తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన 24 కార్మిక సంఘాలు వేతనాల పెంపు కోసం సినిమా షూటింగ్‌లను నిలిపివేయాలంటూ బంద్ కొనసాగిస్తున్నారని తెలిసిందే. సినీ కార్మికులు తమ సమస్యల గురించి హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో లేబర్ కమిషనర్ ఆఫీసుకు కూడా వెళ్లారు. మరోవైపు సినీ కార్మికుల వేతనాల పెంపు విషయంపై చిరంజీవితో నిర్మాతలు సమావేశమై చర్చలు జరిపారు. కాగా సినీ కార్మికుల ఆందోళనలపై సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి స్పందించారు. సినీ కార్మికుల వేతనాలను పెంచాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. సినీ ఇండస్ట్రీ అంశాలన్నీ దిల్ రాజుకు అప్పగించాం. సినీ కార్మికుల ఆందోళనపై దిల్ రాజు చర్చిస్తున్నారు. సినిమా టికెట్ల ధరలను పెంచేందుకు అనుమతి ఇస్తున్నాం. కార్మికుల డిమాండ్లపై చర్చించి నిర్ణయం తీసుకోవాలి.

# ఉస్తాద్‌లో పవన్ షెడ్యూల్ పూర్తి
### దర్శకుడు హరీష్ శంకర్ వెల్లడి




**టాకీస్:** పవన్ కల్యాణ్ హీరోగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా కోసం అభిమానులు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి దర్శకుడు గుడ్‌న్యూస్ చెప్పారు. ఈ సినిమాలో పవన్‌కు సంబంధించిన షెడ్యూల్ పూర్తయినట్లు- తెలుపుతూ ఓ ప్రత్యేక ఫొటో పంచుకున్నారు. ఇటీవలే 'హరిహర వీరమల్లు'తో పలకరించిన పవన్‌కల్యాణ్ అదే జోష్‌తో ఇప్పుడు 'ఉస్తాద్ భగత్‌సింగ్'ను పూర్తి చేశారు. ఆయన సపోర్ట్ వల్లే ఈ షెడ్యూల్ త్వరగా పూర్తయినట్లు- హరీశ్ తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌పై ప్రశంసలు కురిపించారు. మాటిస్తే నిలబెట్టుకోవడం, మాట మీదే నిలబడడం.. మీరు పక్కనుంటే కరెంట్ పాకినట్లే అంటూ ఆయనతో దిగిన ఫొటోను పంచుకున్నారు. ఈ రోజును తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని దర్శకుడు తెలిపారు. పవన్ ఎనర్జీ సినిమాకు మరింత పవర్‌ను ఇచ్చిందన్నారు. సపోర్ట్ ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుతం హరీశ్ షేర్ చేసిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో పవన్ సింపుల్ లుక్‌లో కనిపించడంతో అభిమానులు షేర్ చేస్తున్నారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ – హరీశ్‌శంకర్) కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టు- కున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఆయన సరసన శ్రీలీల, రాశీ ఖన్నా నటిస్తున్నారు. దేవీశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ప్రస్తుతం పవన్ 'ఓజీ'లో నటిస్తున్నారు. సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఇది రానుంది.

## విశ్వంభరలో ఆషిక రంగనాథ్
# పోస్టర్ విడుదల



టాకీస్: మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న భారీ విజువల్ ఎక్స్‌పీరియెన్స్ మూవీ 'విశ్వంభర'. యంగ్ డైరెక్టర్ వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ఫాంటసీ డ్రామా, ఇప్పటివరకు వచ్చిన ప్రతి అప్డేట్‌తో భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. ఎం.ఎం.కీరవాణి సంగీతం అందిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇందులో భాగంగా తాజాగా ఈ మూవీ నుంచి స్పెషల్ ట్రీట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్స్‌గా నటిస్తున్న ఆషిక రంగనాథ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌కి వచ్చిన స్పందన చూస్తుంటే.. ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. పోస్టర్ అదిరిపోయింది, ఆషిక కళ్లలో మ్యాజిక్ ఉంది, విశ్వంభరకు మరో హైలైట్ ఆమె అవుతుందని ఫిక్స్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. ఆమె అందాన్ని, క్యారెక్టర్ డెప్త్‌ను హైలైట్ చేస్తోంది. చిరు సరసన త్రిషతో పాటు-, సెకండ్ హీరోయిన్ ఈ కన్నడ బ్యూటీ ఆషిక రంగనాథ్ నటిస్తోంది. ఈ సినిమాను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్న యూవీ క్రియేషన్స్, ప్రమోషనల్ స్ట్రాటజీలో కూడా కొత్తదనం చూపించబోతున్నారు. బర్త్ డే పోస్టర్‌తో మొదలైన ఈ ప్రమోషన్ రన్ ఇక నుంచి రెగ్యులర్‌గా సాగనుందని సమాచారం. భారీ సెట్‌లు, విజువల్ ఎఫెక్ట్స్, మైథలాజికల్ టచ్‌తో కూడిన ఈ సినిమాను వినాయక చవితి లేదా దసరా సీజన్లో విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అంతే కాదు ఎం.ఎం.కీరవాణి అందిస్తున్న సంగీతం మరో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, రీసెంట్ గా 'హరి హర వీరమల్లు' వంటి సినిమాల్లో తన వర్క్‌కి ఇంటర్నేషనల్ గుర్తింపు తెచ్చుకున్న కీరవాణి.. ఇప్పుడు 'విశ్వంభర'కి సంగీతం అందిస్తుండటంతో మ్యూజిక్‌పై అంచనాలు భారీగానే ఉన్నాయి.

# సినిమా ఫెయిల్యూర్‌కు రివ్యూలు కూడా ఓ కారణం
### హీరోయిన్ మృణాళ్ ఠాకూర్



టాకీస్: ఏదైనా ఒక సినిమా వచ్చిందంటే చాలు.. యూట్యూబ్ రివ్యూల, ట్విట్టర్ కామెంట్స్, ఇన్‌స్టా రీల్స్‌తో మైండ్ బ్లాక్ అంటూ ఇష్టం వచ్చిన రివ్యూ ఇస్తున్నారు. అసలు సినిమా ఎలా ఉందో తెలిసేలోపే.. 'ఫ్లాప్', 'ఓవరాక్టింగ్', 'బోర్' అంటూ ట్యాగ్‌లతో దండం పెట్టి ప్రేక్షకుల అభిప్రాయాలను దారి తప్పిస్తున్నారు ఈ ట్రెండ్‌పై ఇప్పటికే పలువురు హీరోలు, నిర్మాతలు నిప్పులు చెరిగారు. తాజాగా బాలీవుడ్ బ్యూటీ- మృణాల్ ఠాకూర్ కూడా ఇదే విషయంపై స్పందించింది. ఇటీవల బాలీవుడ్ లో మృణాల్ నటించిన 'సన్ ఆఫ్ సర్దార్ 2' విడుదలైన మిశ్రమ స్పందన అందుకుంది. ఈ క్రమంలో మృణాల్ తన ఇన్‌స్టా గ్రామ్ ద్వారా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ నిర్వహించారు. ఇందులో ఓ అభిమాని.. నేను నెగిటివ్ రివ్యూలు చూసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' సినిమా చూడలేదు అంటూ కామెంట్ చేశాడు. దీనిపై ఆమె స్పందిస్తూ.. చాలా రివ్యూలు తప్పుదారి పట్టించేవిగా ఉంటున్నాయి. అందుకే రివ్యూలను నమ్మకుండా, మీరే సినిమా చూసి ఓ అభిప్రాయం ఏర్పరచుకోవాలి. ఒక్కోసారి సినిమా ఫెయిల్యూర్‌కి రివ్యూలే కారణం అవుతాయి అంటూ కుండ బద్దలు కొట్టేసింది. ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రివ్యూలు చూసి ప్రేక్షకులు సినిమాకు వస్తే.. అసలు సినిమా ఆత్మను చూడకముందే దాన్ని ఖండించేసినట్లే అవుతుందని ఇండస్ట్రీలో చాలామంది నిపుణులు కూడా చెబుతున్నారు. అయిన కూడా వారి ఆగడాలు ఆగడం లేదు. ఇక ప్రజంట్ మృణాల్ వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్నారు.

# బాలకృష్ణని కలిసిన 'భగవంత్ కేసరి' టీమ్



**టాకీస్:** 71వ జాతీయ చలనచిత్ర అవార్డులను గత శుక్రవారం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో ఉత్తమ చిత్రంగా బాలీవుడ్ చిత్రం '12 ఫెయిల్' ఎంపిక కాగా, 'ఉత్తమ నటుడు' అవార్డును 'జవాన్' చిత్రం నుంచి షారుక్‌ఖాన్, '12 ఫెయిల్' చిత్రం నుంచి విక్రాంత్ మస్సే పంచుకున్నారు. ఇక తెలుగు నుంచి ఉత్తమ చిత్రంగా బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి ఎంపికైంది. అయితే ఈ సినిమాకు నేషనల్ అవార్డు ప్రకటించిన సందర్భంగా భగవంత్ కేసరి చిత్రయూనిట్ అంతా కలిసి నేడు బాలకృష్ణని కలిసింది. అనంతరం బాలయ్యకు శుభాకాంక్షలు తెలిపింది. ఇక ఈ సమవేశంలో బాలయ్యతో పాటు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి, శ్రీలీల తదితరులు పాల్గొన్నారు.

# రవితేజ 'మాస్ జాతర' నుంచి 'ఓలే ఓలే' పాట విడుదల




**టాకీస్:** నటుడు రవితేజ హీరోగా శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'మాస్ జాతర'. ఈ చిత్రానికి భాను భోగవరపు దర్శకత్వం వహిస్తుండగా.. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఆగష్టు 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్ మొదలుపెట్టింది చిత్రయూనిట్. తాజాగా ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్ 'ఓలే ఓలే' అనే పాటను విడుదల చేసింది చిత్రయూనిట్. భాస్కర్ యాదవ్ దాసరి సాహిత్యం అందించిన ఈ పాటకు భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించడంతో పాటు రోహిణి సోరట్‌తో కలిసి పాడారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.